'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 52 | మంగళవారం | 6.10.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 52 | Tuesday | 6.10.2026 | Pages: 8 | Rate: 2



7లో..

ప్రార్థనలు చంపడానికా? బతికించడానికా?

ఒకరు అంతం చేయాలనుకున్నారు? • మరొకరు ప్రాణాలు నిలబెట్టారు?

ఫ్లై దుబాయ్ ఘటనతో మొదలైన చర్చ • పైలట్ సాహసాన్ని గుర్తించలేరా?

రాహుల్ నోరెందుకు మెదపరన్న బీజేపీ • ముస్లిం బుజ్జగింపు రాజకీయాల కోసమనా?

ఆకాశంలో 34 వేల అడుగుల ఎత్తు.. విమానంలో వందలాది మంది ప్రయాణికులు.. కాక్‌పిట్‌లో అకస్మాత్తుగా ప్రాణాంతక దాడి! గాయాలతో నేలకూలిన పైలట్ చేతుల్లో అప్పటికే ప్రయాణికుల ప్రాణాలు ఉన్నాయి. క్షణం ఆలస్యం అయితే విమానం ఏ దిశలో దూసుకెళ్లేదో తెలియని పరిస్థితి. ఆ సమయంలో ఆయనకు గుర్తొచ్చింది హనుమాన్ చాలీసా. ప్రార్థన చేస్తూనే మళ్లీ లేచిన కెప్టెన్ స్మిత్ మచ్చార్ చివరకు కాక్‌పిట్‌ను తెరిచి, విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేయించి వందలాది ప్రాణాలను కాపాడారు. అదే సమయంలో మరో ప్రశ్న దేశ రాజకీయాలను కుదిపేస్తోంది. ప్రార్థన ప్రాణాలను కాపాడటానికా? ప్రాణాలు తీయటానికా? ఈ ఘటనలో ఒకవైపు హనుమాన్ చాలీసాతో ధైర్యం తెచ్చుకున్న పైలట్ ఉంటే.. మరోవైపు ప్రార్థన చేసిన తర్వాత దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సహ పైలట్ ఉన్నాడు. ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా గాయపడిన కెప్టెన్‌తో మాట్లాడారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందించారు. మరి రాహుల్ గాంధీ ఎందుకు మాట్లాడలేదు? కాంగ్రెస్ అగ్రనేతల మౌనం వెనుక కారణమేంటి? ముస్లిం ఓటు బ్యాంక్ రాజకీయాలేనా? లేక కాంగ్రెస్ వ్యూహంలో మార్పు అవసరమా? ఈ ప్రశ్నలన్నింటి వెనుక ఉన్న అసలు కథ ఏమిటి?



వివరాలు2లో..

ఫామ్ 6 మార్పులపై కొత్త వివాదం

• సీఈసీపై అక్రమ మార్పుల ఆరోపణలు

• జ్ఞానేశ్ కుమార్‌పై భగ్గుమన్న కాంగ్రెస్

ప్రత్యేక సారాంశ ఓటర్ల జాబితా సవరణ (సర్) వ్యవహారంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై కాంగ్రెస్ తీవ్ర ఆరోపణలు చేసింది. సుప్రీంకోర్టు అనుమతితోనే ఫామ్ 6లో మార్పులు చేశామని ఎన్నికల సంఘం గతంలో పేర్కొన్నప్పటికీ, అలాంటి మార్పులకు కోర్టు ఆమోదం ఇవ్వలేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని కాంగ్రెస్ పేర్కొంది. దీంతో జ్ఞానేశ్ కుమార్ ఫామ్ 6ను ఏకపక్షంగా, చట్టవిరుద్ధంగా మార్చారని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. తొలిసారి ఓటర్ల జాబితాలో పేరు చేర్చుకునేందుకు అర్హులైన వ్యక్తులు ఉపయోగించే కీలక పత్రం ఫామ్ 6 కావడంతో ఈ వ్యవహారం ఎన్నికల ప్రక్రియపై తీవ్ర ప్రభావం చూపుతుందని కాంగ్రెస్ వాదిస్తోంది.



సుప్రీం స్పష్టత!

మార్పులు సూచించలేదన్న కోర్టు • సీఈసీకి రక్షణలపైనా కీలక వ్యాఖ్యలు

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్) సందర్భంగా ఫామ్ 6లో చేసిన మార్పులతో సుప్రీంకోర్టుకు ఎలాంటి సంబంధం లేదని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ స్పష్టం చేశారు. "ఫామ్ 6లో ఎలాంటి మార్పులు మేము చేయలేదు" అని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం స్పష్టంగా పేర్కొంది. కొత్త ఓటర్ల నమోదుకు ఉపయోగించే ఫామ్ 6, 1960 నాటి ఓటర్ల నమోదు నిబంధనల్లో చట్టబద్ధమైన పత్రం. అందులో మార్పులు చేయాలంటే సరైన చట్టపరమైన ప్రక్రియ అనుసరించాల్సి ఉంటుందని కోర్టు తెలిపింది.

ఫామ్ 6 నుంచి 8 వరకు

• తప్పుడు దరఖాస్తులపై కొరడా • ఎలక్షన్ కమిషనర్ వార్నింగ్

తెలంగాణలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో తప్పుడు వివరాలు, తప్పుడు ప్రకటనలు ఇచ్చే దరఖాస్తుదారులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ఫామ్ 6, 6ఏ, 7, 8 ద్వారా దరఖాస్తు చేసే సమయంలో ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ఇచ్చినట్లు తేలితే చట్ట ప్రకారం చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లకు సూచించారు. అనంతరం వారు సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని పేర్కొన్నారు. సోమవారం జారీ చేసిన మెమోలో ఫామ్ 7 ద్వారా భారీ సంఖ్యలో దరఖాస్తులు రావడం తమ దృష్టికి వచ్చినట్లు సీఈవో తెలిపారు. కొన్ని దరఖాస్తులు అసలైనవిగా లేవన్న ఆరోపణలు కూడా కార్యాలయానికి అందాయని వెల్లడించారు.



కేటీఆర్ ఫ్లైఓవర్ ప్లాన్‌లో మార్పులు!

వన్‌వే సక్సెస్‌తో జీహెచ్ఎంసీ నయా ప్లాన్

హైదరాబాద్‌లో కేటీఆర్ పార్క్ చుట్టూ ప్రతిపాదించిన ఫ్లైఓవర్ ప్రాజెక్ట్‌ పూర్తిగా మారిపోయింది. వన్‌వే ట్రాఫిక్ విధానం విజయవంతం కావడం, కోర్టు కేసుల కారణంగా పనుల్లో ఎదురైన జాప్యం వంటి అంశాల నేపథ్యంలో 14 ఫ్లైఓవర్ల పాత ప్రణాళికను ప్రభుత్వం ఒకే సమగ్ర ఎలివేటెడ్ కారిడార్‌గా మార్చిందని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ తెలిపారు. సోమవారం కేటీఆర్ పార్క్ పరిసరాల్లో అధికారులతో కలిసి పనులను పరిశీలించిన ఆయన మీడియాతో మాట్లాడారు. కొత్త ప్రతిపాదనలో జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్ వరకు 4.3 కిలోమీటర్ల ఫ్లైఓవర్ నిర్మించనున్నారు. ఈ మార్పుతో కేబీఆర్ పార్క్ నుంచి ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్ వరకు కొనసాగుతున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు.



2లో..



ఓటు సమరం

వ్యవస్థపై యుద్ధమా?

6లో..

సీఈసీపై పోరు.. సుప్రీంకోర్టు ముందుకు రాజకీయ తుఫాను

ఢిల్లీలో జంతర్‌మంతర్ నుంచి హైదరాబాద్ గాంధీభవన్ వరకు ఆందోళనల సెగ... సుప్రీంకోర్టు గడప దాటిన ఆరోపణలు.. ఎన్నికల సంఘం చుట్టూ ముసురుకుంటున్న అనుమానాలు... సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై ప్రతిపక్షాల నేరుగా దాడి! అసలు ఏం జరుగుతోంది? ఫామ్ 6లో మార్పులు ఎవరు చేశారు? సర్‌లో ఓటర్ల పేర్లు ఎలా తొలగించారు? ఎన్నికల సంఘం నిర్ణయాలు ఏకపక్షంగా జరిగాయా? ఈ ప్రశ్నలతో దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు ఈసీ, కేంద్రానికి నోటీసులు జారీ చేయడం ఇప్పుడు దేశ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. కోర్టు మాత్రం ఆరోపణలను ఇప్పుడే నిజమని తేల్చలేదు.. రికార్డులు పరిశీలించి, ఎన్నికల సంఘం సమాధానం విన్న తర్వాతే నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది. మరోవైపు కాంగ్రెస్ సీఈసీ రాజీనామా, సర్ రద్దు... బ్యాలెట్ పేపర్లపై ఎన్నికలు నిర్వహించాలంటూ మూడు డిమాండ్లతో పోరును ముమ్మరం చేసింది. జైరాం రమేశ్ "జీ2" వ్యాఖ్యలతో దాడిని మరింత తీవ్రం చేశారు. ఎన్ఎస్‌యూఐ నుంచి ఇండియా కూటమి వరకు రోడ్డెక్కాయి. తెలంగాణలో ఫామ్ 7లపై కొత్త ఆరోపణలు.. కేరళలో పాత కేసులపై న్యాయపరమైన కదలికలు.. అన్నీ ఒకేసారి తెరపైకి వచ్చాయి. ఇది కేవలం సీఈసీపై పోరా? లేక భారత ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసానికి జరుగుతున్న అసలు పరీక్షా? అసలు లోపల ఏం జరుగుతోంది?



ఖైరతాబాద్ ఎన్నిక

అనర్హతపై దానం స్పష్టత

ఖైరతాబాద్ రాజకీయాల్లో ఎమ్మెల్యే అనర్హత, ఎన్నికల పిటిషన్, ఉపఎన్నికల అంశాలు మరోసారి చర్చకు వచ్చాయి. తాజాగా మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ తనపై వచ్చిన అనర్హత వేటుపై స్పందించారు. (వివరాలు 2లో..)



సిద్దిపేటలో పోలీస్ ఆంక్షలు..

ధర్నాలు, రాస్తారోకోలకు అనుమతి తప్పనిసరి

సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమల్లోకి వచ్చింది. పోలీస్ కమిషనర్ ఎన్. రష్మీ పెరుమాళ్ ఐపీఎస్ ఉత్తర్వుల మేరకు అక్టోబర్ 5 ఉదయం 6 గంటల నుంచి అక్టోబర్ 20 ఉదయం 6 గంటల వరకు ఆంక్షలు కొనసాగనున్నాయి. ఈ కాలంలో ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదు. అత్యవసర కార్యక్రమాలకు సంబంధిత ఏసీపీ నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరి. బంద్ పేరుతో సంస్థలు, కార్యాలయాలను బలవంతంగా మూసివేయించడం, బెదిరింపులకు పాల్పడటాన్ని పోలీసులు తీవ్రంగా పరిగణిస్తారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. (వివరాలు 2లో..)


ఏసీబీ వలకు టౌన్ ప్లానింగ్ అధికారి!

నాలుగు లక్షల లంచం డిమాండ్

మెహదీపట్నంలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టివేత



హైదరాబాద్ మెహదీపట్నంలో జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ రూ.4 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. గోల్కొండ జోన్ సర్కిల్-33లో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న తులసీరాం సునీత..ఓ వ్యక్తినుంచి రూ.8 లక్షల లంచం డిమాండ్ చేసినట్లు అవినీతి నిరోధక శాఖ అధికారులు తెలిపారు. అందులో మొదటి విడతగా రూ.4 లక్షలు స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో ఏర్పాటు చేసిన ట్రాప్‌లో ఆమె పట్టుబడ్డారు. (వివరాలు 2లో..)



2లో..

ఆరోగ్య శాఖలో లక్ష లంచం కలకలం

ఏసీబీకి చిక్కిన రంగారెడ్డి డీఎంహెచ్‌వో

ఫిజియోథెరపీ సెంటర్ కేసులో పట్టివేత

రామప్పకు ముప్పు లేదు

మైనింగ్‌పై అపోహలు నమ్మొద్దు • సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ప్రకటన



రామప్ప ప్రపంచ వారసత్వ కట్టడానికి సింగరేణి మైనింగ్ వల్ల ముప్పు పొంచి ఉందంటూ వస్తున్న వార్తలు అవాస్తవాలు, అపోహలేనని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ స్పష్టం చేసింది. ములుగు జిల్లా వెంకటాపూర్‌లో ప్రతిపాదించిన వెంకటాపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టుపై సోమవారం సంస్థ కీలక ప్రకటన విడుదల చేసింది. రామప్ప దేవాలయానికి ఎలాంటి నష్టం జరగకుండా అన్ని అంశాలను శాస్త్రీయంగా పరిశీలించిన తర్వాతే ప్రాజెక్టుపై నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. ప్రస్తుతం మైనింగ్ కార్యకలాపాలను ప్రారంభించే నిర్ణయం తీసుకోలేదని పేర్కొంది. సమగ్ర శాస్త్రీయ అధ్యయనం పూర్తయ్యే వరకు ప్రాజెక్టుపై ముందుకు వెళ్లబోమని సింగరేణి యాజమాన్యం స్పష్టం చేసింది. దీంతో రామప్ప చుట్టూ మైనింగ్ ప్రాజెక్టుపై నెలకొన్న ఆందోళనలకు సంస్థ వివరణ ఇచ్చింది. (వివరాలు 2లో..)



రామప్పకు ముప్పా?

గని ప్రతిపాదనపై కేటీఆర్ అభ్యంతరం

రామప్ప దేవాలయానికి సమీపంలో ప్రతిపాదించిన ఓపెన్ కాస్ట్ బొగ్గు గనిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. భూములపై ఆధిపత్యం తర్వాత ఇప్పుడు భూమి లోపల ఉన్న ఖనిజ సంపద కోసం చారిత్రక వారసత్వ కట్టడాలను ప్రమాదంలోకి నెట్టే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు. రామప్ప ఆలయం తెలంగాణ శిల్పకళకు ప్రతీకగా నిలుస్తోందని, 2021లో యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించిన ఈ కట్టడం పరిరక్షణ అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. రామప్పకు సమీపంలో గనుల తవ్వకాలకు అనుమతి ఇవ్వడం వల్ల చారిత్రక ప్రదేశం భద్రతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని కేటీఆర్ అన్నారు. (వివరాలు 2లో..)



5లో..

వెన్నుపోటును మించిన

పన్ను పోటు

• పన్ను పీకేస్తారా? • టాక్స్ కడుతున్న ప్రజలకే.. శిక్ష..!?

• పెరుగుతున్న భారం.. బతికేదెలా?

జీతం చేతికి రాకముందే ఒక పన్ను.. జీతం వచ్చిన తర్వాత ఖర్చు చేస్తే మరో పన్ను.. ఇల్లు కొంటే ఇంకో పన్ను.. కారు కొంటే రోడ్డు పన్ను.. పెట్రోల్ పోయిస్తే ఇంధన పన్ను.. పెట్టుబడి పెడితే మూలధన లాభాల పన్ను.. చివరకు మనం కొనే ప్రతి వస్తువులోనూ పన్ను భాగమే! ఇలా సంపాదించిన ప్రతి రూపాయిలోనూ, ఖర్చు చేసిన ప్రతి రూపాయిలోనూ ప్రజలపై పన్ను భారం పడుతున్నా.. ఆ డబ్బుతో ప్రజల జీవితాలు ఎందుకు అదే స్థాయిలో మెరుగుపడటం లేదు? దేశ ఖజానాకు పన్నుల రూపంలో భారీగా ఆదాయం వస్తోంది. అయినా ప్రభుత్వాలకు అప్పులు తప్పడం లేదు. అప్పులపై వడ్డీలకే భారీ మొత్తం వెళ్తోంది. మరోవైపు విద్య, వైద్యం వంటి ప్రజల జీవితాలను నేరుగా మార్చే రంగాలకు దక్కుతున్న వాటాపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రోడ్లు వేసినా కొద్దికాలానికే గుంతలు.. ప్రభుత్వ ఆసుపత్రులున్నా ప్రైవేట్ వైద్యం తప్పని పరిస్థితి.. ప్రభుత్వ విద్య ఉన్నా ప్రైవేట్ ఫీజుల భారం.. అయితే సమస్య పన్ను వసూలులోనా? పన్ను ఎగవేతలోనా? ప్రభుత్వ ఖర్చులోనా? లేక జవాబుదారీతనం లేని వ్యవస్థలోనా? తెలుగు ప్రజల జేబుల నుంచి వెళ్తున్న ప్రతి రూపాయి ఎక్కడికి వెళ్తోంది? నేరం ఎవరిది.. శిక్ష మాత్రం ప్రజలకే ఎందుకు? అసలు లెక్క ఇదే..!



ఫామ్ 6 మార్పులపై కొత్త వివాదం

- సీఈసీపై అక్రమ మార్పుల ఆరోపణలు
- జ్ఞానేశ్ కుమార్‌పై భగ్గుమన్న కాంగ్రెస్

సీఈసీపై ప్రతిపక్షం తీవ్ర దాడి

సుప్రీంకోర్టు ఈ వ్యవహారంపై కేంద్రం, ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో కాంగ్రెస్ తన విమర్శలను మరింత తీవ్రం చేసింది. ఫామ్ 6లో మార్పులు చట్టబద్ధంగా జరగలేదని రాహుల్ గాంధీ ఆరోపించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మరో అడుగు ముందుకేసి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా, సర్ రద్దు, బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు నిర్వహించాలన్నవి పార్టీకి మార్పులేని మూడు డిమాండ్లని ప్రకటించారు. ఈ అంశాలపై కాంగ్రెస్ కార్యకర్తలు, ఇండియా కూటమి భాగస్వాములు దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నారని తెలిపారు. ఎన్నికల సంఘంపై ప్రజల్లో ఏర్పడుతున్న అనుమానాలను సుప్రీంకోర్టు తీర్చాల్సిన అవసరం ఉందని పార్టీ నేతలు చెబుతున్నారు.

రాజ్యాంగ పరిరక్షణపై కాంగ్రెస్ ప్రశ్నలు

కాంగ్రెస్ కమ్యూనికేషన్ విభాగం ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ కూడా సీఈసీపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఒత్తిడికి అనుగుణంగా జ్ఞానేశ్ కుమార్ రాజ్యాంగస్ఫూర్తిని ఉల్లంఘించారని ఆరోపించారు. సర్ ప్రక్రియలో తొందరపాటు, సరైన విధానం పాటించకపోవడం, తప్పుగా ఓటర్ల పేర్లు తొలగించారన్నవిమర్శలు ఉన్నాయని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఇప్పటికే ఈ అంశాన్ని పరిశీలిస్తున్న నేపథ్యంలో ఎన్నికల సంఘంపై ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించే అవకాశం కోర్టుకు ఉందని జైరాం రమేశ్ అన్నారు. ఫామ్ 6 మార్పుల వెనుక ఉద్దేశం కొత్త తరం ఓటర్లను లక్ష్యంగా చేసుకోవడమేనని కూడా కాంగ్రెస్ ఆరోపించింది.

ఫామ్ 6పై సుప్రీం స్పష్టత!

మార్పులు సూచించలేదన్న కోర్టు
సీఈసీకి రక్షణలపైనా కీలక వ్యాఖ్యలు



పరిపాలనా స్థాయిలో ఏకపక్షంగా మార్పులు చేయడం సరికాదని సూచించింది. ఫామ్ 6కు అదనపు డిక్లరేషన్ జతచేయడం, దరఖాస్తుదారులు తాము, తల్లిదండ్రులు, తాతముత్తాతలు గత సర్ జాబితాల్లో నమోదయ్యారా అనే వివరాలు ఇవ్వడం వంటి కొత్త షరతులు ఈ వివాదానికి కారణమయ్యాయి.

సీఈసీ రక్షణపై న్యాయమూర్తి ప్రశ్న

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను సస్పెండ్ చేయాలని కోరుతూ దాఖలైన రెండు పిటిషన్ల విచారణలో జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ కీలక వ్యాఖ్యలు చేశారు. పదవి నుంచి వైదొలిగిన తర్వాత కూడా ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్లకు చట్టపరమైన రక్షణ కల్పించే 2023 నాటి నిబంధనపై ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. పదవిలో ఉన్నప్పుడు రక్షణ అర్థం చేసుకోవచ్చని, పదవి ముగిసిన తర్వాత కూడా రక్షణ కల్పించడం న్యాయమూర్తులకు కూడా లేదని వ్యాఖ్యానించారు. పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ సీఈసీకి ఉన్న అధికారాలను తాత్కాలికంగా తొలగించాలని కోరారు. దానికి "అప్పుడు ఎన్నికలను ఎవరు నిర్వహిస్తారు?" అని జస్టిస్ బాగ్చీ ప్రశ్నించారు.

ఆరోపణలపై ఆధారాలు కావాలన్న కోర్టు

సర్‌లో ఢిల్లీలో 30 శాతం, పశ్చిమ బెంగాల్‌లో 25 శాతం ఓటర్ల పేర్లు తొలగించబడ్డాయని పిటిషనర్ల తరపు న్యాయవాది మేనకా గురుస్వామి కోర్టుకు తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో లక్షలాది అప్పీలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. ఓటు హక్కుకే ముప్పు ఏర్పడిందని వాదించారు. అయితే ఆరోపణలను ముందుగానే నిజమని భావించలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. ఎన్నికల సంఘం నుంచి ముందుగా స్పష్టమైన సమాధానాలు, సంబంధిత రికార్డులు పరిశీలించాల్సి ఉందని సీజేఐ సూర్యకాంత్ తెలిపారు. రెండు పిటిషన్లను కలిపిన కోర్టు, ఎన్నికల సంఘం వాదనను విన్న తర్వాత తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకోనుంది. కేసును వచ్చే వారం విచారణకు తీసుకునే అవకాశం ఉందని ధర్మాసనం సంకేతమిచ్చింది.

ఫామ్ 6 నుంచి 8 వరకు తప్పుడు దరఖాస్తులపై కొరడా

స్టేట్ ఎలక్షన్ కమిషనర్ వార్నింగ్



తెలంగాణలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో తప్పుడు వివరాలు, తప్పుడు ప్రకటనలు ఇచ్చే దరఖాస్తుదారులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ఫామ్ 6, 6ఏ, 7, 8 ద్వారా దరఖాస్తు చేసే సమయంలో ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ఇచ్చినట్లు తేలితే చట్ట ప్రకారం చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లకు సూచించారు. అనంతరం వారు సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని పేర్కొన్నారు. సోమవారం జారీ చేసిన మెమోలో ఫామ్ 7 ద్వారా భారీ సంఖ్యలో దరఖాస్తులు రావడం తమ దృష్టికి వచ్చినట్లు సీఈవో తెలిపారు. కొన్ని దరఖాస్తులు అసలైనవిగా లేవన్న ఆరోపణలు కూడా కార్యాలయానికి అందాయని వెల్లడించారు.

భారీ దరఖాస్తులపై విచారణ

ఫామ్ 7 ద్వారా ఓటర్ల పేర్ల తొలగింపునకు పెద్ద సంఖ్యలో దరఖాస్తులు రావడంపై అధికారులు అప్రమత్తమయ్యారు. ఇలాంటి దరఖాస్తుల్లో తప్పుడు సమాచారం ఉద్దేశపూర్వకంగా ఇచ్చారా లేదా అన్న అంశాన్ని నిర్ధారించేందుకు ముందుగా విచారణ చేపట్టాల్సి ఉంటుందని సీఈవో స్పష్టం చేశారు. కేవలం ఆరోపణల ఆధారంగా వెంటనే చర్యలు తీసుకోకుండా, ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించాలని సూచించారు. ముఖ్యంగా ఒకేసారి పెద్ద సంఖ్యలో దరఖాస్తులు రావడం వెనుక వాస్తవ పరిస్థితులను అధికారులు పరిశీలించాల్సి ఉంటుంది. ఓటర్ల జాబితా పారదర్శకతను కాపాడటం, అర్హులైన ఓటర్ల పేర్లు అనవసరంగా తొలగిపోకుండా చూడటం ఈ ప్రక్రియలో కీలకమని అధికారులు భావిస్తున్నారు.

నిబంధనల ప్రకారం చర్యలు

తప్పుడు ప్రకటనలపై చర్యలు తీసుకునే ముందు 1960 నాటి రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్‌లోని రూల్ 20 ప్రకారం విచారణ నిర్వహించాలని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. విచారణలో తప్పు చేసినట్లు నిర్ధారణ అయితే ప్రజాప్రాతినిధ్య చట్టం, 1950లోని సెక్షన్ 31 కింద చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటర్ల జాబితాలో మార్పులు చేసే ప్రక్రియలో ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని సీఈవో సూచించారు. దీంతో ఫామ్ 6, 6ఏ, 7, 8ల ద్వారా వచ్చే దరఖాస్తులపై ఎన్నికల యంత్రాంగం మరింత కఠినంగా పరిశీలన చేపట్టే అవకాశం కనిపిస్తోంది.



కేటీఆర్ ఫ్లైఓవర్ ప్లాన్‌లో మార్పులు!

వన్‌వే సక్సెస్‌తో జీహెచ్ఎంసీ నయా ప్లాన్

రూ.800 కోట్ల భూసేకరణ భారం తగ్గింపు

కొత్త ప్రాజెక్టు ద్వారా అధిక విలువైన ప్రైవేట్ భూముల సేకరణను గణనీయంగా తగ్గించడంతో సుమారు రూ.800 కోట్లు ఆదా అవుతాయని జీహెచ్ఎంసీ వెల్లడించింది. గతంలో చెట్ల తొలగింపునకు సంబంధించిన అనుమతులపై కోర్టు వివాదాలు తలెత్తడంతో నిర్మాణ పనులు ఆలస్యమయ్యాయని కమిషనర్ తెలిపారు. కేటీఆర్ పార్క్ చుట్టూ డివైడర్లలో ఉన్న చెట్లను తొలగించడంపై గతంలో తీవ్ర విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. అయితే పర్యావరణానికి జరిగిన నష్టానికి ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుందా అన్న అంశంపై కమిషనర్ స్పష్టత ఇవ్వలేదు. కొత్త ప్రాజెక్టు రూ.1,090 కోట్ల అంచనా వ్యయంతో కొనసాగనుంది. సిగ్నల్ రహిత రాకపోకలకు వీలుగా
మూడు లేన్లతో వెళ్లే మార్గం, మూడు లేన్లతో వచ్చే మార్గం కలిగిన ఉక్కు వంతెన నిర్మించనున్నారు.

రెండు ప్యాకేజీలుగా స్టీల్ ఫ్లైఓవర్

ఈ భారీ కారిడార్‌ను ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) విధానంలో రెండు ప్యాకేజీలుగా చేపట్టనున్నారు. మొదటి ప్యాకేజీలో జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ జంక్షన్ నుంచి ముగ్ధ జంక్షన్ వరకు స్టీల్ ఫ్లైఓవర్ నిర్మించనున్నారు. దీని అంచనా వ్యయం రూ.580 కోట్లు. రెండో ప్యాకేజీలో ముగ్ధ జంక్షన్ నుంచి ముఫకంజా కాలేజీ వరకు ఫ్లైఓవర్ నిర్మించడంతో పాటు బంజారాహిల్స్ రోడ్ నంబర్ 1కు ప్రత్యేక కనెక్టింగ్ ర్యాంప్ ఏర్పాటు చేయనున్నారు. వేగంగా నిర్మాణం పూర్తి చేసేందుకు ఆధునిక స్టీల్ నిర్మాణ సాంకేతికతను ఉపయోగించనున్నట్లు జీహెచ్ఎంసీ తెలిపింది. దీంతో కేబీఆర్ పరిసరాల్లో ట్రాఫిక్ నిర్వహణకు కొత్త రూపు ఇవ్వాలని అధికారులు భావిస్తున్నారు.

రామప్పకు ముప్ప లేదు

- మైనింగ్‌పై అపోహలు నమ్మొద్దు
- సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ప్రకటన

రామప్ప ప్రపంచ వారసత్వ కట్టడానికి సింగరేణి మైనింగ్ వల్ల ముప్పు పొంచి ఉందంటూ వస్తున్న వార్తలు అవాస్తవాలు, అపోహలేనని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ స్పష్టం చేసింది. ములుగు జిల్లా వెంకటాపూర్‌లో ప్రతిపాదించిన వెంకటాపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టుపై సోమవారం సంస్థ కీలక ప్రకటన విడుదల చేసింది. రామప్ప దేవాలయానికి ఎలాంటి నష్టం జరగకుండా అన్ని అంశాలను శాస్త్రీయంగా పరిశీలించిన తర్వాతే ప్రాజెక్టుపై నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. ప్రస్తుతం మైనింగ్ కార్యకలాపాలను ప్రారంభించే నిర్ణయం తీసుకోలేదని పేర్కొంది. సమగ్ర శాస్త్రీయ అధ్యయనం పూర్తయ్యే వరకు ప్రాజెక్టుపై ముందుకు వెళ్లబోమని సింగరేణి యాజమాన్యం స్పష్టం చేసింది. దీంతో రామప్ప చుట్టూ మైనింగ్ ప్రాజెక్టుపై నెలకొన్న ఆందోళనలకు సంస్థ వివరణ ఇచ్చింది.

నిపుణుల నివేదికల తర్వాతే నిర్ణయం

వెంకటాపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టుపై భారత పురావస్తు శాఖతో పాటు ఇతర ప్రతిష్ఠాత్మక సంస్థల నుంచి శాస్త్రీయ నివేదికలు తీసుకున్న తర్వాతే తదుపరి చర్యలు చేపడతామని సింగరేణి తెలిపింది. రామప్ప ఆలయం నిర్మాణం, పరిసర ప్రాంతాల భౌగోళిక పరిస్థితులు, పర్యావరణ ప్రభావం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించాల్సి ఉంటుందని పేర్కొంది. నిపుణుల అధ్యయనాల్లో రామప్పకు ఎలాంటి ప్రమాదం ఉండదని నిర్ధారణ అయినప్పుడే మైనింగ్ అంశంపై ముందుకు సాగుతామని సంస్థ స్పష్టం చేసింది. వారసత్వ కట్టడం భద్రతకు ఎలాంటి రాజీ ఉండదని తేల్చి చెప్పింది.

వారసత్వ పరిరక్షణకు కట్టుబాటు

తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థగా సింగరేణికి రాష్ట్ర వారసత్వ సంపద పరిరక్షణపై పూర్తి బాధ్యత ఉందని యాజమాన్యం పేర్కొంది. ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయానికి ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టం కలిగించే చర్యలు చేపట్టబోమని స్పష్టం చేసింది. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ, చట్టబద్ధమైన పద్ధతుల్లోనే మైనింగ్ కార్యకలాపాలు నిర్వహించడం తమ విధానమని పునరుద్ఘాటించింది. శాస్త్రీయ ఆధారాలు, నిపుణుల సూచనలు, సంబంధిత శాఖల నివేదికల ఆధారంగానే తుది నిర్ణయం ఉంటుందని తెలిపింది. దీంతో రామప్ప మైనింగ్ అంశంపై వస్తున్న ఆందోళనలకు సింగరేణి అధికారిక వివరణతో తెరదించే ప్రయత్నం చేసింది.

రామప్పకు ముప్పా?

గని ప్రతిపాదనపై కేటీఆర్ అభ్యంతరం



రామప్ప దేవాలయానికి సమీపంలో ప్రతిపాదించిన ఓపెన్ కాస్ట్ బొగ్గు గనిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. భూములపై ఆధిపత్యం తర్వాత ఇప్పుడు భూమి లోపల ఉన్న ఖనిజ సంపద కోసం చారిత్రక వారసత్వ కట్టడాలను ప్రమాదంలోకి నెట్టే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు. రామప్ప ఆలయం తెలంగాణ శిల్పకళకు ప్రతీకగా నిలుస్తోందని, 2021లో యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించిన ఈ కట్టడం పరిరక్షణ అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. రామప్పకు సమీపంలో గనుల తవ్వకాలకు అనుమతి ఇవ్వడం వల్ల చారిత్రక ప్రదేశం భద్రతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని కేటీఆర్ అన్నారు.

తవ్వకాలు.. బ్లాస్టింగ్స్‌పై ఆందోళన

ప్రతిపాదిత ఓపెన్ కాస్ట్ గనిలో భారీ స్థాయిలో లోతైన తవ్వకాలు, బ్లాస్టింగ్స్ జరిగితే వాటి ప్రభావం రామప్ప ఆలయం, రామప్ప చెరువుపై పడే అవకాశం ఉందని కేటీఆర్ అన్నారు. గనుల ప్రభావంతో భూగర్భ జలాల ప్రవాహం, చెరువు పరిసర ప్రాంతాలపై మార్పులు రావచ్చన్న ఆందోళనలు ఇప్పటికే వ్యక్తమయ్యాయి. రామప్ప ఆలయ నిర్మాణం సున్నితమైన పునాదిపై ఉండటంతో నిరంతర ప్రకంపనలు దీర్ఘకాలంలో ప్రభావం చూపవచ్చని వారసత్వ పరిరక్షణ వర్గాలు కూడా హెచ్చరించాయి. ప్రతిపాదిత గని ప్రాంతం రామప్ప ఆలయం, చెరువుకు సుమారు 5 కిలోమీటర్ల దూరంలో ఉందని నివేదికలు పేర్కొంటున్నాయి. సుమారు 300 మీటర్ల లోతు వరకు తవ్వకాలు చేపట్టే అవకాశం ఉందన్న సమాచారం కూడా ఆందోళనకు కారణమైంది.

ప్రతిపాదన వెనక్కి తీసుకోండి

వారసత్వ సంపదకు నష్టం కలిగించే ఏ చర్యనైనా బీఆర్ఎస్ వ్యతిరేకిస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు. రామప్ప దేవాలయానికి హాని కలిగించే అవకాశమున్న ఓపెన్ కాస్ట్ బొగ్గు గని ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

ఖైరతాబాద్ ఎన్నిక
అనర్హతపై దానం స్పష్టత



ఖైరతాబాద్ రాజకీయాల్లో ఎమ్మెల్యే అనర్హత, ఎన్నికల పిటిషన్, ఉపఎన్నికల అంశాలు మరోసారి చర్చకు వచ్చాయి. తాజాగా మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ తనపై వచ్చిన అనర్హత వేటుపై స్పందించారు. అఫిడవిట్‌లో సమాచారం సరిగా ఇవ్వలేదన్న కారణంతో తాను అనర్హతకు గురికాలేదని స్పష్టం చేశారు. మరో పార్టీ తరపున పోటీ చేయడం వల్లే అనర్హత వేటు పడిందని తెలిపారు. ఈ పరిణామం వస్తుందని తనకు ముందే తెలుసని, పార్టీ నిర్ణయం మేరకే తాను రాజకీయ పోరాటం చేశానని చెప్పారు. విజయారెడ్డి దాఖలు చేసిన ఎన్నికల పిటిషన్‌పై గతంలోనే కోర్టులో అఫిడవిట్ సమర్పించిన విషయాన్ని కూడా దానం గుర్తుచేశారు. దీంతో ఖైరతాబాద్ ఉపఎన్నికపై కొనసాగుతున్న ఉత్కంఠకు ఆయన వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

విజయారెడ్డి పిటిషన్‌తో ఉత్కంఠ


గత అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా దానం నాగేందర్ గెలుపొందారు. తర్వాత రాజకీయ పరిణామాల్లో ఆయన మరో పార్టీకి మారడంతో అనర్హత వేటు పడింది. దీంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు అసెంబ్లీ సెక్రటేరియట్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇదే సమయంలో ఎన్నికల అఫిడవిట్‌లో సరైన వివరాలు ఇవ్వలేదని ఆరోపిస్తూ కాంగ్రెస్ నేత విజయారెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. దానం ఎన్నికను రద్దు చేసి తనను ఎమ్మెల్యేగా ప్రకటించాలని ఆమె పిటిషన్‌లో కోరారు. ఈ కేసుపై తీర్పు వచ్చే వరకు ఉపఎన్నిక నిర్వహించకూడదని కూడా ఆమె కోర్టును కోరారు. ఇప్పుడు అనర్హతకు అసలు కారణంపై దానం చేసిన తాజా వ్యాఖ్యలతో ఖైరతాబాద్ ఉపఎన్నికపై రాజకీయ చర్చ మరింత వేడెక్కింది.

సిద్దిపేటలో పోలీస్ ఆంక్షలు.. నో ర్యాలీలు!

ధర్నాలు, రాస్తారోకోలకు అనుమతి తప్పనిసరి

డీజేలకు బ్రేక్.. ఉల్లంఘిస్తే కేసులు

సిద్దిపేట కమిషనరేట్ పరిధిలో భారీ శబ్దాలతో డీజే సౌండ్ వినియోగంపైనా నిషేధం విధించారు. చిన్నారులు, వృద్ధులు, రోగులు, విద్యార్థులకు శబ్ద కాలుష్యం వల్ల ఇబ్బందులు కలగకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కమిషనర్ తెలిపారు. మైక్ సెట్ అవసరమైన సందర్భాల్లో సంబంధిత డివిజన్ ఏసీపీ నుంచి ముందస్తు అనుమతి పొందాలి. ఆంక్షలను ఉల్లంఘించే వారిపై బీఎన్ఎస్ సెక్షన్ 223, సిటీ పోలీస్ యాక్ట్, పోలీస్ యాక్ట్-1861లోని సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తామని పోలీసులు స్పష్టం చేశారు. పరిస్థితులు అదుపులో ఉండేలా ప్రజలు పోలీసులకు సహకరించాలని అధికారులు సూచించారు.



లక్ష లంచం

- ఏసీబీకి చిక్కిన రంగారెడ్డి డీఎంహెచ్‌వో
- ఫిజియోథెరపీ సెంటర్ కేసులో పట్టివేత

రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో లంచం వ్యవహారం కలకలం రేపింది. ఫిజియోథెరపీ సెంటర్‌కు సంబంధించిన కేసులో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి స్వర్ణకుమారి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ ఎం. శ్రీనివాస్‌ను ఏసీబీ అధికారులు సోమవారం పట్టుకున్నారు. వీరి తరపున ఓ ప్రైవేట్ వ్యక్తి రూ.లక్ష లంచం తీసుకుంటుండగా ఏసీబీ ట్రాప్‌లో చిక్కుకున్నాడు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. డీఎంహెచ్ఓ లైసెన్స్ లేకుండా ఫిజియోథెరపీ సెంటర్ నిర్వహిస్తున్నారన్న కారణంతో అధికారులు దాన్ని సీజ్ చేసి తాళాలు స్వాధీనం చేసుకున్నారు. సెంటర్ తాళాలు తిరిగి ఇవ్వడం, తదుపరి చర్యలు తీసుకోకుండా చూడడం, కొత్త లైసెన్స్ మంజూరు చేయడం కోసం ఫిర్యాదుదారుడి నుంచి రూ.2 లక్షలు డిమాండ్ చేసినట్లు ఏసీబీ ఆరోపించింది.

అధికారుల తరపున నగదు స్వీకరణ

హెల్త్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్న మద్దూరి కృష్ణయ్య.. ఇద్దరు అధికారుల సూచనల మేరకు లంచం డిమాండ్ చేసి, సోమవారం ఫిర్యాదుదారుడి నుంచి మొదటి విడతగా రూ.1 లక్ష స్వీకరించినట్లు ఏసీబీ తెలిపింది. ముందస్తు సమాచారంతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో ట్రాప్ నిర్వహించారు. నగదు స్వీకరించిన వెంటనే మద్దూరి కృష్ణయ్యను పట్టుకున్నారు. అతడి సూచనతో రూ.1 లక్ష లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో డీఎంహెచ్ఓ స్వర్ణకుమారి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తమ అధికారిక బాధ్యతలను దుర్వినియోగం చేసి అనుచిత ప్రయోజనం పొందేందుకు ప్రయత్నించారని ఏసీబీ ఆరోపించింది.

ముగ్గురికి రిమాండ్

లంచం కేసులో స్వర్ణకుమారి, శ్రీనివాస్, మద్దూరి కృష్ణయ్యలను నాంపల్లిలోని ఎస్‌పీఈ, ఏసీబీ కేసుల ఫస్ట్ అడిషనల్ స్పెషల్ జడ్జి ఎదుట హాజరుపరచేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అనంతరం ముగ్గురినీ న్యాయ రిమాండ్‌కు తరలించనున్నట్లు ఏసీబీ వెల్లడించింది. ఫిజియోథెరపీ సెంటర్‌కు సంబంధించిన లైసెన్స్ వ్యవహారంలో అధికారులు ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నారు, లంచం డిమాండ్ ఎలా జరిగింది, ఈ వ్యవహారంలో మరెవరైనా ఉన్నారా అనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది. కేసు దర్యాప్తు పూర్తయ్యే వరకు ఫిర్యాదుదారుడి గుర్తింపు, ఇతర వ్యక్తిగత వివరాలను భద్రతా కారణాలతో అధికారులు వెల్లడించలేదు.

ఏసీబీ వలకు టౌన్ ప్లానింగ్ అధికారి!

- నాలుగు లక్షల లంచం
- మెహదీపట్నంలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టివేత



హైదరాబాద్ మెహదీపట్నంలో జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ రూ.4 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. గోల్కొండ జోన్ సర్కిల్-33లో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న తులసీరాం సునీత.. ఓ వ్యక్తి నుంచి రూ.8 లక్షల లంచం డిమాండ్ చేసినట్లు అవినీతి నిరోధక శాఖ అధికారులు తెలిపారు. అందులో మొదటి విడతగా రూ.4 లక్షలు స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో ఏర్పాటు చేసిన ట్రాప్‌లో ఆమె పట్టుబడ్డారు. ఫిర్యాదు అందిన వెంటనే రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు, మెహదీపట్నంలో లంచం తీసుకుంటున్న సమయంలో ఆమెను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని నగదును స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న లంచం నగదును తదుపరి దర్యాప్తులో భాగంగా అధికారులు పరిశీలిస్తున్నారు.

నిర్మాణ అనుమతుల్లో సహకారం కోసం

ఫిర్యాదుదారుడికి అధికారికంగా అనుకూలంగా వ్యవహరించేందుకు సునీత లంచం అడిగినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ జారీ చేసిన స్పీకింగ్ ఆదేశాలను పట్టించుకోకుండా నిర్మాణ పనులు కొనసాగించేందుకు అనుమతించడం, ఇకపై ఇబ్బందులు కలిగించకుండా చూడడం, భవిష్యత్తులో కూడా సహకరించడం వంటి అంశాలకు సంబంధించి ఆమె డబ్బు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఫిర్యాదుదారుడి నుంచి తొలి విడత నగదు తీసుకుంటున్న సమయంలోనే ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఈ వ్యవహారంలో లంచం డిమాండ్ చేసిన పరిస్థితులు, అధికారిక నిర్ణయాలపై ప్రభావం చూపేందుకు ప్రయత్నించారా అనే అంశాలపై కూడా అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

లెక్కల్లో లేని రూ.2.5 లక్షలు స్వాధీనం

ట్రాప్ ఆపరేషన్ సమయంలో సునీత వద్ద లెక్కల్లో చూపని మరో రూ.2.5 లక్షల నగదు కూడా ఏసీబీ అధికారులకు లభించింది. ఆ మొత్తాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. దీంతో మొత్తం వ్యవహారంపై ఏసీబీ దర్యాప్తు మరింత కీలకంగా మారింది. లంచం కేసుకు సంబంధించిన ఆధారాలు, నగదు మూలాలు, అధికారిక వ్యవహారాల్లో ఆమె పాత్రపై అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. తదుపరి చర్యల్లో భాగంగా సునీతను నాంపల్లిలోని ఎస్‌పీఈ, ఏసీబీ కేసుల ఫస్ట్ అడిషనల్ స్పెషల్ జడ్జి ఎదుట హాజరుపరిచి, న్యాయ రిమాండ్‌కు తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ ఘటనతో జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగంలో అవినీతి ఆరోపణలపై మరోసారి చర్చ మొదలైంది.



రాజ్యసభ రేసు

సీనియర్లకు బీజేపీ ఝలక్

యూపీలో కొత్త ముఖాలకు పెద్దపీట

ఉత్తరప్రదేశ్ నుంచి జరగనున్న రాజ్యసభ ఎన్నికలకు బీజేపీ ఎనిమిది మంది అభ్యర్థులను ప్రకటించింది. రాధాకాంత్ ఓజా, ప్రకాశ్ పాల్, ధర్మపాల్ సింగ్, విద్యాసాగర్ సోంకర్, రామ్ ప్రతాప్ సింగ్ చౌహాన్, గోపీ కృష్ణ పాండే, ప్రియాంక సింగ్ రావత్, శ్రుతి గంగ్వార్‌లను పార్టీ బరిలోకి దించింది. అభ్యర్థుల ఎంపికలో సామాజిక సమీకరణాలకు ప్రాధాన్యం ఇచ్చినట్లు స్పష్టమవుతోంది. ముగ్గురు ఓబీసీలకు, ఇద్దరు బ్రాహ్మణులకు అవకాశం కల్పించారు. లోధీ వర్గానికి చెందిన యూపీ మంత్రి ధర్మపాల్ సింగ్, బీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ప్రకాశ్ పాల్, కుర్మీ సామాజిక వర్గానికి చెందిన శ్రుతి గంగ్వార్‌కు టికెట్లు దక్కాయి. బ్రాహ్మణ వర్గం నుంచి మాజీ అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాధాకాంత్ ఓజా, పార్టీ సీనియర్ నేత గోపీ కృష్ణ పాండేను ఎంపిక చేశారు.

ఎస్సీలకు రెండు స్థానాలు

బీజేపీ జాబితాలో ఎస్సీ సామాజిక వర్గానికి కూడా రెండు అవకాశాలు లభించాయి. ఖటీక్ వర్గానికి చెందిన విద్యాసాగర్ సోంకర్, మాజీ పార్టీ రాష్ట్రప్రధాన కార్యదర్శి, రాజ్యసభ అభ్యర్థిగా ఎంపికయ్యారు. పాసీ వర్గానికి చెందిన మాజీ బారాబంకీ లోక్‌సభ సభ్యురాలు ప్రియాంక సింగ్ రావత్‌కు కూడా టికెట్ దక్కింది. అయితే ఈ జాబితాలో అందరి దృష్టిని ఆకర్షించిన అంశం ప్రస్తుత రాజ్యసభ సభ్యులందరినీ పక్కన పెట్టడం. యూపీ నుంచి పదవీకాలం ముగుస్తున్న బీజేపీకి చెందిన మొత్తం ఎనిమిది మంది స్థానంలో కొత్తవారిని ఎంపిక చేశారు. కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురీ, కేంద్ర సహాయ మంత్రి బీఎల్ వర్మకు కూడా టికెట్ నిరాకరించారు. దీంతో వీరిద్దరూ ఇకపై కేంద్ర మంత్రివర్గంలో కొనసాగుతారా అన్న చర్చ మొదలైంది.

16న రాజ్యసభ పోరు

ఉత్తరప్రదేశ్‌లో 10 రాజ్యసభ స్థానాలకు అక్టోబర్ 16న ఎన్నికలు జరగనున్నాయి. అసెంబ్లీలో ఉన్న సంఖ్యాబలాన్ని బట్టి బీజేపీ కనీసం ఏడు స్థానాలు గెలుచుకునే స్థితిలో ఉంది. సమాజ్‌వాదీ పార్టీ ఇప్పటికే రామ్ గోపాల్ యాదవ్, పారిశ్రామికవేత్త ధన్‌రాజ్ నత్వానీ పేర్లను ప్రకటించింది. మూడో స్థానానికి కూడా ఎస్పీ పోటీ చేసే అవకాశం ఉంది. అదే జరిగితే ఎన్నిక అనివార్యం కానుంది. నామినేషన్లకు గడువు ముగియడానికి ఒక రోజు ముందు బీజేపీ తన జాబితాను ప్రకటించింది. గత కొంతకాలంగా మాజీ కేంద్ర మంత్రులు, సీనియర్ నేతల పేర్లు పరిశీలనలో ఉన్నా చివరకు కొత్త ముఖాలకు అవకాశం ఇవ్వడం ద్వారా బీజేపీ కీలక రాజకీయ సంకేతం ఇచ్చింది.



మహిళల భద్రతపై

సుప్రీం ఆదేశాలు

- 24 గంటల నిఘా కేంద్రాలు తప్పనిసరి

ఢిల్లీలో మహిళలు, బాలికలపై లైంగిక నేరాలను అడ్డుకునేందుకు 24 గంటల పర్యవేక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఢిల్లీ పోలీసులను ఆదేశించింది. జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ కే. వినోద్ చంద్రన్ ధర్మాసనం సోమవారం ఈ కీలక ఆదేశాలు ఇచ్చింది. సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయడం మాత్రమే సరిపోదని, వాటిని నిరంతరం పర్యవేక్షిస్తూ అనుమానాస్పద కదలికలను గుర్తించి వెంటనే స్పందించే వ్యవస్థ ఉండాలని స్పష్టం చేసింది. విద్యాసంస్థలు, కళాశాలలు, బహిరంగ ప్రదేశాల వద్ద పోలీసు గస్తీని పెంచాలని సూచించింది. దేశ రాజధానిలో వరుసగా నమోదవుతున్న మహిళలు, మైనర్లపై లైంగిక దాడుల నేపథ్యంలో సుప్రీంకోర్టు స్వయంచాలకంగా చేపట్టిన విచారణలో ఈ ఆదేశాలు వెలువడ్డాయి.

ప్రమాదకర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

విద్యాసంస్థల చుట్టుపక్కల యువతులను వేధించే అసాంఘిక వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ధర్మాసనం సూచించింది. ఢిల్లీలోని అక్రమ తినుబండారాలు, మద్యం అందించే కేంద్రాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయన్న సమాచారాన్ని ప్రస్తావించింది. అలాంటి ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించింది. ఢిల్లీలోని ఆస్తా కుంజ్ పార్క్ వద్ద 17 ఏళ్ల బాలికపై జరిగిన సామూహిక అత్యాచారానికి ముందే స్థానికులు పోలీసులకు భద్రతా సమస్యలను తెలియజేశారని కోర్టు గుర్తుచేసింది. అయినా చర్యలు తీసుకోలేదని పేర్కొంటూ ప్రజలతో నేరుగా సంబంధాలు కొనసాగించాల్సిన బాధ్యత పోలీసులదేనని స్పష్టం చేసింది. పోలీసు గస్తీలో లోపాలు ఉన్నాయని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కూడా అంగీకరించారు.

కాగితాలపై ఆదేశాలు వద్దు

నేరాలను అడ్డుకోవాలంటే నిందితుల్లో చట్టంపై భయం కలిగేలా పోలీసు చర్యలు ఉండాలని జస్టిస్ పార్దీవాలా స్పష్టం చేశారు. పండుగ సెలవుల సమయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళలపై వేధింపులను అడ్డుకునేందుకు ఢిల్లీ పోలీసుల 'శిష్టాచార్' బలగం ఉన్నప్పటికీ, దాని పనితీరు, తీసుకున్న చర్యలపై ప్రజలకు స్పష్టమైన సమాచారం లేదని కోర్టు సహాయ కురాలు లిజ్ మాథ్యూ తెలిపారు. దీంతో ఆదేశాలు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలు కావాలని ధర్మాసనం హెచ్చరించింది. అవసరమైతే మరింత కఠినంగా వ్యవహరించేందుకు వెనుకాడొద్దని పోలీసులకు సూచించింది. తీసుకోవాల్సిన చర్యలను నమోదు చేస్తూ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపిన కోర్టు, తదుపరి విచారణను నవంబర్ 16కు వాయిదా వేసింది.

సుప్రీం నోటీసుతో ప్రజాస్వామ్యంపై భరోసా

- సంస్థలు స్వతంత్రంగానే పనిచేస్తున్నాయన్న బీజేపీ

సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి, ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేయడమే దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ బలంగా పనిచేస్తోందనడానికి నిదర్శనమని బీజేపీ పేర్కొంది. ఎన్నికల కమిషన్‌లోని ఇద్దరు కమిషనర్ల అనుమతి లేకుండా కొన్ని నిర్ణయాలు తీసుకున్నారన్న పిటిషన్‌పై సుప్రీంకోర్టు స్పందించింది. దీనిపై వారం రోజుల్లో సమాధానం ఇవ్వాలని కేంద్రం, ఈసీని ఆదేశించింది. ఈ పరిణామాన్ని ప్రస్తావించిన బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి, ఎంపీ సంబిత్ పాత్ర.. సుప్రీంకోర్టుకు పిల్ వెళ్లడం, దానిపై విచారణ జరగడం, మరోవైపు వాదన వినేందుకు నోటీసులు ఇవ్వడం సహజమైన ప్రజాస్వామ్య, న్యాయ ప్రక్రియ అని వివరించారు. దేశంలో భయ వాతావరణం ఉందన్న ప్రతిపక్ష ఆరోపణలకు ఈ పరిణామమే సమాధానమని అన్నారు.

ఈసీలో భిన్నాభిప్రాయాలపై బీజేపీ వివరణ

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌తో ఇద్దరు ఎన్నికల కమిషనర్లు లేఖల ద్వారా అభిప్రాయ భేదాలు వ్యక్తం చేయడం కూడా ప్రజాస్వామ్యానికి ఆరోగ్యకరమైన సంకేతమేనని సంబిత్ పాత్ర అన్నారు. నిర్ణయాలపై ప్రశ్నించడం, చర్చించడం, భిన్నాభిప్రాయాలు చెప్పడం, చివరికి ఏకాభిప్రాయంతో ముందుకు సాగడం ప్రజాస్వామ్య విధానంలో భాగమని వివరించారు. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేయడం కూడా దేశంలోని సంస్థలు తమ పరిధిలో స్వతంత్రంగా పనిచేస్తున్నాయనడానికి నిదర్శనమని పేర్కొన్నారు. దేశంలో నియంతృత్వం, భయ వాతావరణం ఉందన్న విమర్శలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. రాజ్యాంగ పరిధిలో అన్ని సంస్థలు స్వేచ్ఛగా తమ బాధ్యతలు నిర్వహిస్తున్నాయని తెలిపారు.

పంజాబ్ ప్రభుత్వంపై విమర్శలు

ఇదే సమయంలో పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వంపై సంబిత్ పాత్ర తీవ్ర విమర్శలు చేశారు. సీఎం భగవంత్ మాన్ ఓఎస్డీ, ఆయన సన్నిహితులపై ఈడీ చేసిన అవినీతి ఆరోపణల నేపథ్యంలో పంజాబ్-హర్యానా హైకోర్టు సీబీఐ దర్యాప్తుకు ఆదేశించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి ఆందోళనకరంగా మారిందని ఆరోపించారు. కేవలం 48 గంటల్లో నాలుగు హత్యలు జరిగాయని, ప్రముఖ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్, మేకప్ ఆర్టిస్ట్ కూడా హత్యకు గురయ్యారని చెప్పారు. పోలీసు సిబ్బందే హత్యలకు గురవుతున్నప్పుడు సాధారణ ప్రజలకు ప్రభుత్వం ఎలా భద్రత కల్పిస్తుందన్నది ప్రశ్నగా మారిందని సంబిత్ పాత్ర వ్యాఖ్యానించారు.



జమిలి జగడం

- ఒకే దేశం.. ఒకే ఎన్నికపై రగడ!
- ఎంపికపై సగరికా ఘోష్ అభ్యంతరం



దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించే ప్రతిపాదనపై పరిశీలన చేస్తున్న పార్లమెంటరీ సంయుక్త కమిటీ సోమవారం పలువురు మీడియా ప్రముఖులు, ఆర్థికవేత్తల అభిప్రాయాలను స్వీకరించింది. అయితే టీవీ యాంకర్ సుధీర్ చౌధరీని సాక్షిగా ఆహ్వానించడంపై తృణమూల్ కాంగ్రెస్ రాజ్యసభ సభ్యురాలు సగరికా ఘోష్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కమిటీ చైర్మన్ పి.పి. చౌధరీకి రాసిన లేఖలో.. ఏకకాల ఎన్నికల అంశంపై సుధీర్ చౌధరీ చేసిన చివరి "రాతపూర్వక లేదా ప్రసార" పని ఏమిటో వెల్లడించాలని ఆమె ప్రశ్నించారు. ఈ అంశంపై విస్తృతంగా రిపోర్టింగ్ చేసిన న్యాయ ప్రతినిధులు, జర్నలిస్టులను ఆహ్వానించి ఉంటే మరింత సముచితంగా ఉండేదని పేర్కొన్నారు.

నిపుణతే ప్రాతిపదిక కావాలి

సుధీర్ చౌధరీకి సంబంధించిన 2012 నాటి కేసును కూడా సగరికా ఘోష్ తన లేఖలో ప్రస్తావించారు. ఆ కేసులో తీవ్ర ఎక్స్‌టార్షన్ ఆరోపణలు ఉండగా ఆయన న్యాయ కస్టడీలో ఉన్న విషయాన్ని గుర్తుచేశారు. అయితే కస్టడీలో ఉండటం ఒక్కటే కమిటీ ముందు హాజరుకాకుండా అర్హత కోల్పోయే కారణం కాదన్న చైర్మన్ అభిప్రాయాన్ని ఆమె అంగీకరించారు. తన అసలు అభ్యంతరం వ్యక్తిగతం కాదని, సాక్షులను వారి నిరూపిత నిపుణత, విశ్వసనీయ రికార్డు ఆధారంగా ఎంపిక చేయాలన్న సూత్రంపైనేనని స్పష్టం చేశారు. భవిష్యత్ సమావేశాల్లో మీడియా ప్రతినిధుల ఎంపికకు అనుసరించిన ప్రమాణాలను సభ్యులకు ముందుగానే తెలియజేయాలని కోరారు.

ఏకకాల ఎన్నికలపై భిన్న స్వరాలు

కమిటీ ముందు హాజరైన మీడియా ప్రముఖులు వన్ నేషన్-వన్ ఎలక్షన్‌పై భిన్న అభిప్రాయాలు వ్యక్తం చేసినట్లు సమాచారం. అంజనా ఓం కశ్యప్, సుధీర్ చౌధరీ ప్రతిపాదనకు మద్దతు ఇస్తూ ప్రభుత్వ ఖజానాపై ఎన్నికల వ్యయం తగ్గుతుందని పేర్కొన్నారు. రాహుల్ సిన్హా కూడా బిల్లుకు మద్దతు తెలిపినా, ఎన్నికల సంఘానికి ప్రతిపాదించిన అధికారాలను మరోసారి సమీక్షించాలని సూచించారు. రాజ్ చెంగప్ప, శేఖర్ గుప్తా మాత్రం ప్రజల తీర్పును తరచూ పునరుద్ధరించుకోవడం ప్రజాస్వామ్యానికి అవసరమని అభిప్రాయపడ్డారు. ఆర్థికవేత్తలు వి. అనంత నాగేశ్వరన్, ఎస్. మహేంద్ర దేవ్, ఎస్. గురుమూర్తి సంస్కరణకు మద్దతు తెలిపారు. తరచూ జరిగే ఎన్నికలు పనరుల మళ్లింపు, విధాన నిర్ణయాల్లో జాప్యం, పాలనపై ఎన్నికల ప్రభావం పెంచుతున్నాయని వారు వివరించారు.

మాటలతో మదనపల్లె మంటలు చల్లారవ్

- నిధులెప్పుడెస్తారు.. పనులెప్పుడు మొదలుపెడతారు
- ఎంపీ, వైసీపీ సీనియర్ నేత మిథున్ రెడ్డి విమర్శలు



మదనపల్లె అభివృద్ధిపై కూటమి ప్రభుత్వాన్ని రాజంపేట ఎంపీ పి.వి. మిథున్ రెడ్డి ప్రశ్నించారు. మదనపల్లెకు వచ్చి లక్ష కోట్ల రూపాయల అభివృద్ధి గురించి మాట్లాడుతున్న ప్రభుత్వ పెద్దలు.. క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను కూడా పరిశీలించాలని ఆయన సూచించారు. అభివృద్ధిపై ప్రకటనలు చేయడం మాత్రమే కాకుండా, గతంలో ప్రారంభించిన పనుల పురోగతి, ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. మదనపల్లెకు అవసరమైన మౌలిక వసతులపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరారు.

నీటి వనరులపై ఎంపీ కీలక ప్రశ్నలు

మదనపల్లె సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల పరిస్థితిపై మిథున్ రెడ్డి ప్రశ్నలు సంధించారు. హంద్రీ-నీవా కాలువ ద్వారా ఈ ట్యాంకులను ఎప్పుడు నీటితో నింపుతారో ప్రభుత్వం స్పష్టం చేయాలని కోరారు. నీటి వనరులు అందుబాటులోకి వస్తే మదనపల్లె ప్రజల తాగునీటి అవసరాలతో పాటు ప్రాంతీయ అభివృద్ధికి కూడా ప్రయోజనం ఉంటుందని పేర్కొన్నారు. నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా ప్రభుత్వం నిర్దిష్ట ప్రణాళికను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఉపయోగపడే ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

విద్యా, వైద్య ప్రాజెక్టులపై నిలదీత

మదనపల్లె మెడికల్ కాలేజీ నిర్మాణం ఎందుకు నిలిచిపోయిందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని మిథున్ రెడ్డి కోరారు. బి.టి. కాలేజీ కోసం సుమారు రూ.200 కోట్ల విలువైన భూములు కేటాయించినా యూనివర్సిటీ ఏర్పాటు ఎందుకు జరగలేదని ప్రశ్నించారు. కేంద్రీయ విద్యాలయం కోసం కేటాయించిన భూముల పరిరక్షణపై కూడా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. మదనపల్లె అభివృద్ధిలో మౌలిక వసతులు, విద్య, వైద్యం, నీటి వనరులకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతి అంశంపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని ఎంపీ డిమాండ్ చేశారు.





భవ్యశ్రీకి పార్లమెంట్‌లో అరుదైన అవకాశం

అమలాపురం: సమసస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఉండ్రాజవరపు భవ్యశ్రీకి జాతీయ స్థాయిలో అరుదైన అవకాశం లభించింది. లోక్‌సభ సచివాలయం ఆధ్వర్యంలోని పార్లమెంటరీ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెమోక్రసీస్ నిర్వహించిన 'నో యువర్ లీడర్' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అక్టోబర్ 2న న్యూఢిల్లీలోని సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్‌లో జరిగిన జాతీయ నాయకుల జయంతి వేడుకల్లో దేశవ్యాప్తంగా ఎంపికైన యువతతో కలిసి భవ్యశ్రీ పాల్గొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, జాతీయ నాయకుల ఆదర్శాలు, ప్రజాస్వామ్య విలువలపై యువతలో అవగాహన పెంచడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో పాల్గొని తిరిగి వచ్చిన భవ్యశ్రీని కోనసీమ జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ కలెక్టరేట్‌లో ఘనంగా సత్కరించి అభినందించారు. విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు లభిస్తాయని కలెక్టర్ అన్నారు. సంవిధాన్ సదన్‌లో కార్యక్రమానికి హాజరుకావడం గర్వకారణమని భవ్యశ్రీ ఆనందం వ్యక్తం చేశారు. ఆమెను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, స్థానికులు అభినందించారు.



ఏపీలో నాలుగు పోలీస్ కమిషనరేట్లు

- ప్రధాన నగరాలకు కొత్త వ్యవస్థ ఏర్పాటు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తిరుపతి, కర్నూలు, రాజమహేంద్రవరం, గుంటూరు నగరాలకు పోలీస్ కమిషనరేట్లు ఏర్పాటు చేస్తూ జీవోలు జారీ చేసింది. పెరుగుతున్న రద్దీ, ట్రాఫిక్, నేరాలు, వీఐపీ భద్రత, శాంతిభద్రతల నిర్వహణను మరింత సమర్థంగా చేపట్టేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. తిరుపతి కమిషనర్‌గా ఐజీపీ లేదా డీఐజీ స్థాయి అధికారి వ్యవహరించనున్నారు. తిరుమల, తిరుపతి, శ్రీకాళహస్తి, శ్రీసిటీ పేర్లతో నాలుగు జోన్లు ఏర్పాటు చేశారు. కమిషనర్‌కు బీఎన్ఎస్ఎస్2023లోని సెక్షన్ 14(6) కింద ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ అధికారాలు కల్పించారు.

పోస్టుల పునర్వ్యవస్థీకరణ

తిరుపతి కమిషనరేట్ కోసం ఇప్పటికే ఉన్న పలు పోలీస్ పోస్టులను డీసీపీ, అదనపు డీసీపీ, ఏసీపీ హోదాల్లోకి మార్చారు. నాలుగు అదనపు ఎస్పీ పోస్టులను అదనపు డీసీపీలుగా, 12 డీఎస్పీ పోస్టులను ఏసీపీలుగా పునర్నియమించారు. కొత్త పోస్టులు సృష్టించడం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. రాజమహేంద్రవరం కమిషనరేట్‌కు నలుగురు డీసీపీలు, నలుగురు అదనపు డీసీపీలు, ఐదుగురు ఏసీపీలు కేటాయించారు. గుంటూరు కమిషనరేట్‌కు ఐదుగురు డీసీపీలు, నలుగురు అదనపు డీసీపీలు, ఆరుగురు ఏసీపీలు కేటాయించారు. మూడు కమిషనరేట్లకు ఐజీపీ లేదా డీఐజీ స్థాయి అధికారి సారథ్యం వహించనున్నారు.

ఫామ్–6 వివాదంపై ఈసీ వివరణ

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సందర్భంగా ఫారమ్-6లో మార్పులు చేసి, ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్షంగా వ్యవహరించారన్న రాహుల్ గాంధీ ఆరోపణలను ఈసీ తప్పుబట్టింది. బిహార్‌లో సర్‌కు సంబంధించి 2025 జూన్ 24న జారీ చేసిన ఉత్తర్వును కమిషన్ ఏకగ్రీవంగా ఆమోదించిందని, 2026 మే 27న సుప్రీంకోర్టు కూడా దానిని సమర్థించిందని స్పష్టం చేసింది. అయితే రాహుల్ గాంధీ లేవనెత్తిన ప్రస్తుతం వినియోగిస్తున్న సవరించిన ఫారమ్-6ను ఎవరు, ఏ అనుమతితో మార్చారన్న కీలక ప్రశ్నకు ఈసీ సమాధానం ఇవ్వలేదు. ఇదే అంశంపై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం మార్పులు ఎవరు చేశారో అధికారిక రికార్డుల ద్వారా పరిశీలిస్తామని తెలిపింది. కొత్త ఫారమ్‌లో దరఖాస్తుదారు లేదా తల్లిదండ్రులు గత సర్‌లో మ్యాప్ అయ్యారా అనే వివరాలను ప్రకటించాల్సి ఉంది. గతంలో ఇతర రాష్ట్రాల సర్, ఫామ్-6లో ఈ నిబంధన లేదు.

సౌజన్యకు అంతర్జాతీయ ఉపాధ్యాయ గౌరవం



అనకాపల్లికి చెందిన తెలుగు ఆచార్యురాలు, ప్రవచనకర్త బాల సౌజన్య కుమారికి అంతర్జాతీయ స్థాయి ఉపాధ్యాయ రత్న పురస్కారం లభించింది. అక్టోబర్ 5 ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణకు చెందిన ఆల్ ద బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ ఆర్గనైజేషన్ నిర్వహించిన అంతర్జాతీయ ఉత్తమ ప్రతిభా పురస్కారాలు-2026లో ఆమెను ఉపాధ్యాయ రత్న అవార్డుకు ఎంపిక చేసింది. చిన్న వయసులోనే విద్యారంగంలో విశేష సేవలు అందించడంతో పాటు సనాతన ధార్మిక సంస్కృతి, విలువలపై ప్రవచనాలు చేస్తూ సౌజన్య ప్రత్యేక గుర్తింపు పొందారని సంస్థ ఫౌండర్ ఎస్. సూర్యనారాయణ తెలిపారు. తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు నిర్మాణం జరుగుతుందని, అలాంటి బాధ్యతను సమర్థంగా నిర్వర్తిస్తున్న సౌజన్యకు ఈ పురస్కారం దక్కడం అభినందనీయమన్నారు. ఈ గౌరవం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని సౌజన్య తెలిపారు. తనను తీర్చిదిద్దిన తల్లిదండ్రులు, గురువులకు ఈ పురస్కారాన్ని అంకితం చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

రాజంపేటలో రాజు రీ సౌండ్..!

పవన్ ప్రశంసలతో జనసేనలో జోష్

కడప జిల్లా ప్రొద్దుటూరు పర్యటనకు వచ్చిన ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్.. రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గంలో పార్టీ వ్యవహారాలను ముందుకు నడిపిస్తున్న యల్లటూరు శ్రీనివాసరాజుపై ప్రశంసలు కురిపించినట్టు సమాచారం. రాయలసీమలోని ఇతర పార్లమెంటరీ నియోజకవర్గాలతో పోలిస్తే రాజంపేటలో జనసేన కార్యకలాపాలు, కేడర్ విస్తరణ, గ్రామస్థాయి రాజకీయ కదలికలు ప్రత్యేకంగా కనిపిస్తున్నాయని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా పార్టీని పగడ్బందీ వ్యూహంతో ముందుకు తీసుకెళ్తున్న విధానం, క్షేత్రస్థాయిలో కార్యకర్తలను సమన్వయం చేసుకుంటున్న తీరు, ప్రత్యర్థి పార్టీల నుంచి వస్తున్న వారికి రాజకీయంగా స్థానం కల్పిస్తున్న విధానం వంటి అంశాలను పార్టీ వర్గాల ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నానని పవన్ పేర్కొన్నట్టు తెలుస్తోంది. దీంతో యల్లటూరు శ్రీనివాసరాజు పేరు ఇప్పుడు రాజంపేటకే పరిమితం కాకుండా జనసేన రాష్ట్రస్థాయి రాజకీయ వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది.

రాజంపేటలో పుంజుకుంటున్న జనసేన

రాజంపేటలో జనసేన బలం పెరుగుతోందన్న చర్చకు ఇటీవలి రాజకీయ చేరికలు కూడా కారణంగా నిలుస్తున్నాయి. వైసీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు జనసేన వైపు రావడంతో పాటు టీడీపీకి చెందిన కేడర్ లోని కొందరు కూడా యల్లటూరు శ్రీనివాసరాజు నాయకత్వంపై నమ్మకంతో జనసేనలో చేరుతున్నట్టు స్థానిక రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కొన్ని గ్రామాల్లో కుటుంబాల స్థాయిలోనే పార్టీ మార్పులు చోటుచేసుకుంటున్నాయన్న సమాచారం జనసేన శ్రేణుల్లో ఉత్సాహాన్ని పెంచుతోంది. పొత్తులో ఉన్న టీడీపీ నుంచి కూడా కేడర్ జనసేన వైపు రావడం సహజంగానే రాజకీయ చర్చకు దారితీస్తోంది. అయితే దీనిని కూటమి అంతర్గత పోటీగా కాకుండా స్థానిక పరిస్థితుల ప్రభావంగా జనసేన వర్గాలు అభివర్ణిస్తున్నాయి. గ్రామస్థాయిలో ఎవరు అందుబాటులో ఉంటున్నారు, ఎవరు తమ సమస్యలపై స్పందిస్తున్నారు, ఎవరి నాయకత్వంపై కార్యకర్తలకు నమ్మకం ఏర్పడుతోంది అన్నదే ఈ మార్పులకు ప్రధాన కారణమనే వాదన వినిపిస్తోంది.

టీడీపీ చూపు..

జనసేన ఊపు.. మారిన రూపు

ఇదే పరిణామంపై టీడీపీ అధిష్ఠానం కూడా దృష్టి సారించినట్టు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కడప జిల్లా స్థానిక సంస్థల పరిశీలకుడిగా ఉన్న దీపక్ రెడ్డి ద్వారా రాజంపేటలో చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలపై ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సమాచారం తెప్పించుకున్నట్టు తెలుస్తోంది. టీడీపీ కార్యకర్తలు, కొన్ని కుటుంబాలు జనసేన వైపు ఎందుకు వెళ్తున్నారన్న అంశంపై సమాచారం కోరినట్టు ప్రచారం ఉంది. దీనిపై స్థానిక పరిస్థితుల ప్రభావంతోనే కొంతమంది జనసేన వైపు వెళ్తున్నారని దీపక్ రెడ్డి వివరించినట్టు రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. అయితే టీడీపీ-జనసేన పొత్తు నేపథ్యంలో ఈ పరిణామాన్ని పెద్దగా ప్రతికూలంగా చూడాల్సిన అవసరం లేదన్న అభిప్రాయం కూడా అధిష్ఠానం వైపు నుంచి వ్యక్తమైనట్టు సమాచారం. కూటమిలోని ఒక భాగస్వామ్య పార్టీ బలోపేతం కావడం అంతిమంగా కూటమికే ఉపయోగపడుతుందనే రాజకీయ లెక్క ఇందులో కనిపిస్తోంది.

రాజంపేట వ్యూహం..

జనసేనలో ఊపు

ఇక్కడే యల్లటూరు శ్రీనివాసరాజు రాజకీయ వ్యూహం ఆసక్తికరంగా మారుతోంది. రాజంపేటలో జనసేనకు కేవలం పార్టీ కార్యక్రమాలకే పరిమితం కాకుండా గ్రామస్థాయి నెట్ వర్క్ ను విస్తరించే ప్రయత్నం జరుగుతోందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వైసీపీ వ్యతిరేక ఓటును సమీకరించడంతో పాటు టీడీపీ, జనసేన మధ్య ఉన్న కూటమి సంబంధాలను దెబ్బతీయకుండా కొత్త నాయకులు, కార్యకర్తలకు రాజకీయ స్థలం కల్పించడం ప్రధాన వ్యూహంగా కనిపిస్తోంది. ఈ క్రమంలోనే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నుంచి వచ్చిన ప్రశంసలు యల్లటూరు వర్గాలకు బలాన్నిచ్చాయి. పార్టీ అధినేత నేరుగా గుర్తించడం అంటే క్షేత్రస్థాయిలో చేస్తున్న ప్రయత్నాలకు రాష్ట్ర నాయకత్వం నుంచి గుర్తింపు లభించినట్టేనని జనసైనికులు భావిస్తున్నారు.



రాజంపేటలో యల్లటూరు రాజు సౌండ్

మొత్తంగా చూస్తే రాజంపేటలో ఇప్పుడు జనసేన రాజకీయ శబ్దం క్రమంగా పెరుగుతోంది. ఒకవైపు యల్లటూరు శ్రీనివాసరాజు నాయకత్వంలో పార్టీ విస్తరణపై జనసేనలో చర్చ జరుగుతుంటే.. మరోవైపు టీడీపీ అధిష్ఠానం కూడా అక్కడి కదలికలను గమనిస్తుండటం ఈ నియోజకవర్గానికి ఉన్న రాజకీయ ప్రాధాన్యతను బయటపెడుతోంది. కూటమి అధికారంలో ఉన్న సమయంలోనే ఒక భాగస్వామ్య పార్టీ మరో భాగస్వామ్య పార్టీ కేడర్ ను ఆకర్షించడం భవిష్యత్ స్థానిక రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపే అంశమే. అయితే ప్రస్తుతం ఇది కూటమి విభేదాల కంటే నాయకత్వ సామర్థ్యం, స్థానిక ప్రభావం, కార్యకర్తల ఆకర్షణ చుట్టూ తిరుగుతున్న పరిణామంగా కనిపిస్తోంది.

పవన్ కళ్యాణ్ స్వయంగా యల్లటూరు శ్రీనివాసరాజును అభినందించడం రాజంపేట జనసేనలో కొత్త ఉత్సాహాన్ని నింపగా.. 'రాజంపేటలో రాజు సౌండ్' ఇక రాష్ట్రస్థాయి రాజకీయ చర్చలోకి వస్తోందా? అన్నదే ఇప్పుడు ఆసక్తికరమైన ప్రశ్నగా మారింది.

ప్రచారం కాదు.. పనులే ప్రగతికి

కొలమానమన్న రాచమల్లు



ప్రజా సమస్యలను పరిష్కరించినప్పుడే అభివృద్ధి కనిపిస్తుందని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి అన్నారు. దొరసానిపల్లెలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో అమృత్ పథకం ద్వారా ప్రొద్దుటూరుకు కృష్ణా జలాలు తీసుకొచ్చి తాగునీటి సమస్యను పరిష్కరించామని తెలిపారు. జల్ జీవన్ మిషన్‌లోనూ అనేక పనులు అప్పుడే పూర్తయ్యాయని చెప్పారు. కేంద్రం పథకాన్ని 2028 వరకు కొనసాగిస్తుండగా.. కూటమి ప్రభుత్వం తామే పొడిగించినట్లు చెప్పుకోవడం సరికాదని విమర్శించారు. రాయలసీమ అభివృద్ధిపై మాటలకే పరిమితం కాకుండా పనులు చూపాలని డిమాండ్ చేశారు. ప్రొద్దుటూరుకు కీలకమైన రాజోలి ఆనకట్ట, వరద కాలువ, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, మెడికల్ కాలేజీ, బస్టాండ్ సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదన్నారు. అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా వీటిపై తీసుకున్న చర్యలను ప్రభుత్వం ప్రజలకు వివరించాలని కోరారు. తాళ్లమాపురంలో గత ప్రభుత్వం సచివాలయం, ఆర్బీకే, విలేజ్ క్లినిక్, సీసీ రోడ్లు, పాఠశాల అభివృద్ధి పనులు చేపట్టిందని తెలిపారు. భారీ సభలపై చూపుతున్న శ్రద్ధను ప్రజా సమస్యల పరిష్కారంపైనా చూపాలని సీఎం చంద్రబాబును రాచమల్లు కోరారు.



పులివెందుల టీడీపీలో చేరికలు

పులివెందులలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో టీడీపీలో రాజకీయ చేరికలు కొనసాగుతున్నాయి. నగిరిగుట్ట రాక్ చర్చి ఏరియాకు చెందిన వడ్డెర వెంకటేష్ తో పాటు 20 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. టీడీపీ నాయకుడు తూగుట్ల మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పులివెందుల టీడీపీ ఇన్ చార్జి మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, బీటెక్ రవి సమక్షంలో వారు పార్టీ కండువాలు కప్పుకున్నారు. నూతనంగా పార్టీలో చేరిన కుటుంబాలకు టీడీపీ నేతలు స్వాగతం పలికారు.

రాబోయే మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో టీడీపీకి లభిస్తున్న స్పందనకు తాజా చేరికలు నిదర్శనమని వారు పేర్కొన్నారు. పార్టీలో చేరిన కుటుంబాలు టీడీపీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్, రాష్ట్ర ఉర్దూ, హజ్ డైరెక్టర్ మహబూబ్ బాషా, నల్లాగారి భాస్కర్ రెడ్డి తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిని అభినందించిన సీఎం




విజయవాడ: విజయవాడలోని ఓ ప్రైవేటు కన్వెన్షన్ హాలులో శుక్రవారం రాత్రి నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్-2026 కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ని ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర స్థాయిలో స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్ ఇచ్చిన సందర్భంగా సీఎం మాట్లాడుతూ, అమరావతి రన్నర్స్ సహకారంతో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ విజయవాడలో 'హెచ్ డీఎఫ్ సీ బ్యాంక్ స్వచ్ఛథాన్ 2026'ని విజయపంతంగా నిర్వహించినందుకు సంతోషం వ్యక్తం చేశారు. 23 రాష్ట్రాల నుంచి దాదాపు 12 వేల మంది పాల్గొనే విధంగా స్వచ్ఛథాన్ నిర్వహించినందుకు పట్టాభిరామ్ ని ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు చెప్పారు. ఇదే కార్యక్రమంలో స్వచ్ఛథాన్ నిర్వాహకులు అమరావతి రన్నర్స్ అధ్యక్షుడు రమేష్ రావి, ఆ సంస్థ ప్రతినిధులకు సీఎం చంద్రబాబు ప్రత్యేక బహుమతి అందజేశారు.

విద్యా పనులకు గడువు.. నైపుణ్యాలకు ఊపు



అమలాపురం: జిల్లాలో విద్యాశాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న విద్యా కార్యక్రమాలు, మౌలిక వసతుల పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. పాఠశాల విద్య, సమగ్ర శిక్ష, ఉన్నత విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధిపై నిర్వహించిన సమీక్షలో ఆయన పలు సూచనలు చేశారు. జిల్లాలో గుర్తించిన 11,257 మంది బడిబయటి పిల్లల్లో ఎక్కువ మందిని తిరిగి పాఠశాలలకు తీసుకొచ్చామని, మరో 440 మంది వివరాలు అప్‌డేట్ చేయాల్సి ఉందని తెలిపారు. 23 పీఎం శ్రీ పాఠశాలలకు మంజూరైన రూ.82.98 లక్షలలో 87.69 శాతం నిధులతో అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను అక్టోబర్ 15లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రమాదకరంగా ఉన్న 140 శిథిల భవనాల్లో 15 తొలగించగా, మిగిలిన 125ను త్వరగా తొలగించాలని సూచించారు. 'మనబడి-మన భవిష్యత్తు' కింద 31 అదనపు తరగతి గదుల నిర్మాణం ప్రారంభించాలని చెప్పారు. యువతకు నైపుణ్య శిక్షణ, ఇంటర్న్‌షిప్‌లు కొనసాగించి ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆదేశించారు. పాఠశాల భూముల ఆక్రమణలను అడ్డుకునేందుకు సర్వేలు, సరిహద్దుల గుర్తింపు, రక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

రాజముద్రతో రైతులకు భూహక్కుల భరోసా



తాళ్లరేవు: కూటమి ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో భాగంగా రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాసుపుస్తకాలను తాళ్లరేవు మండలం పటవల, పి.మల్లవరం గ్రామాల రైతులకు పంపిణీ చేశారు. ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ఈ కార్యక్రమంలో పాల్గొని రైతులకు పాసుపుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రీసర్వే ప్రక్రియలో అనేక తప్పిదాలు చోటుచేసుకున్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. రైతుల భూ హక్కులకు మరింత భరోసా కల్పించేందుకు రీసర్వేను చేపట్టి కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు అందిస్తున్నామని చెప్పారు. <None>భూములకు సంబంధించిన రికార్డుల్లో స్పష్టత తీసుకురావడంతో పాటు రెవెన్యూ సేవలను రైతులకు సులభతరం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ హక్కులకు శాశ్వత భరోసా కల్పించేలా చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

ఎన్నాళ్లో.. ప్రమాద హెచ్చరిక..?

నోరుతెరుచుకున్న మ్యాన్ హోల్
జెండా కర్రతో తాత్కాలిక హెచ్చరిక
సున్నం చెరువు అభివృద్ధిపై శ్రద్ధ
రహదారి భద్రతపై మాత్రం ప్రశ్నలు
పట్టించుకోని స్థానిక ఎమ్మెల్యే, హైడ్రా

హైదరాబాద్, అక్టోబర్ 5: బోరబండ నుంచి మాదాపూర్ వైపు వెళ్లే మార్గంలో సున్నం చెరువు ఎదురుగా ఉన్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం రోడ్డుపై ప్రమాదకరంగా కనిపిస్తున్న ఓ తెరిచి ఉన్న మ్యాన్‌హోల్ స్థానికులు, వాహనదారులను ఆందోళనకు గురిచేస్తోంది. ప్రమాదాన్ని సూచించేలా గుంత వద్ద ఓ కర్రను ఏర్పాటు చేసి దానికి నారింజ రంగు వస్త్రాన్ని కట్టారు. దీంతో వాహనదారులు అప్రమత్తం కావాలని సూచించినట్టుగా కనిపిస్తోంది. అయితే ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్‌కు శాశ్వత రక్షణ ఏర్పాటు చేయకుండా ఇలాంటి తాత్కాలిక హెచ్చరికతో సరిపెట్టడం ఎంతవరకు సమంజసమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. బోరబండ-సున్నం చెరువు-మాదాపూర్ మార్గం రాకపోకలకు కీలకమైనదిగా ఉండటంతో రహదారి భద్రతపై అధికారులు తక్షణం దృష్టి పెట్టాలని వారు కోరుతున్నారు. గతంలోనూ ఈ మార్గంలో రహదారి అభివృద్ధి, విస్తరణ పనులు చేపట్టినట్లు అధికారిక, వార్తా రికార్డులు ఉన్నాయి.

తెరిచిన మ్యాన్‌హోల్.. చీకట్లో ప్రాణాలకు పెను ముప్పే

ఇదేరాత్రి వేళల్లో ఈ పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. తగిన వెలుతురు లేకపోయినా, వేగంగా ప్రయాణించే వాహనదారులు గుంతను సకాలంలో గుర్తించకపోయినా ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పితే తీవ్ర ప్రమాదం జరిగే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు. మ్యాన్‌హోల్ తెరిచి ఉండటానికి కారణం ఏమిటి, అది ఎప్పటి నుంచి ఈ స్థితిలో ఉంది, సంబంధిత విభాగానికి సమాచారం అందిందా అనే విషయాలపై స్పష్టత అవసరమని స్థానికులు అంటున్నారు. సమస్యను గుర్తించిన వెంటనే ప్రమాద ప్రాంతాన్ని సురక్షితంగా చుట్టుముట్టి, తాత్కాలిక బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, అనంతరం శాశ్వతంగా మూసివేయాల్సిన అవసరం ఉందని వారు సూచిస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి చర్యలు తీసుకోవడమే ప్రజా భద్రతకు ఉపయోగకరమని వారి వాదన.

అభివృద్ధి సాగినా..

భద్రత మిగిలినా ప్రమాదమే

మరోవైపు సున్నం చెరువు ప్రాంతంలో అభివృద్ధి, నిర్వహణ, డ్రైనేజీకి సంబంధించిన చర్యలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. జీహెచ్ఎంసీ పత్రాల్లో సున్నం చెరువు పరిసరాల్లో చెరువు నిర్వహణ, నీటి కలుపు తొలగింపు వంటి పనులకు సంబంధించిన ప్రతిపాదనలు ఉన్నాయి. అలాగే బోరబండ-మాదాపూర్ మధ్య రహదారి విస్తరణ, వర్షపు నీటి పారుదల వ్యవస్థను మెరుగుపరిచే అంశాలపై 2026లో అధికారులు పరిశీలనలు నిర్వహించినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో చెరువు అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థతో పాటు దానికి ఆనుకుని ఉన్న ప్రధాన రహదారిపై భద్రతా ప్రమాణాలపైనా సమాన దృష్టి అవసరమని స్థానికులు చెబుతున్నారు. అభివృద్ధి పనులు ఒకవైపు జరుగుతున్న సమయంలోనే ప్రజలు నిత్యం ఉపయోగించే రహదారిపై ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్ వంటి సమస్యలు మిగిలిపోకూడదని వారు కోరుతున్నారు.



కలాం రోడ్డుకు గౌరవం

ఎక్కడో, భద్రత ఎక్కడో

'మహనీయుడి పేరున్న రోడ్డుకు ఇదేనా గౌరవం?' అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. దేశ మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త, యువతకు స్ఫూర్తిగా నిలిచిన డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం పేరుతో ఉన్న ఈ రహదారి పరిసరాలు సురక్షితంగా, పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. రహదారిపై తెరిచి ఉన్న మ్యాన్‌హోల్ కనిపిస్తే వెంటనే సంబంధిత అధికారులు స్పందించి ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ముఖ్యంగా ప్రజలు ఎక్కువగా ప్రయాణించే ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్, డ్రైనేజీ మూతలు, రహదారి గుంతలు వంటి అంశాలను క్రమం తప్పకుండా పరిశీలించే వ్యవస్థ అవసరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. గతంలో సున్నం చెరువు పరిసరాల్లో రహదారి, డ్రైనేజీ, వరదనీటి నిర్వహణకు సంబంధించి అధికారుల పరిశీలనలు జరిగిన నేపథ్యంలో ప్రస్తుత సమస్యను కూడా సంబంధిత విభాగాలు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని వారు కోరుతున్నారు.

మ్యాన్‌హోల్ తెరిచే ఉంది..
ప్రమాదం ముందే ఉంది

ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ అధికారులు వెంటనే స్పందించి తెరిచి ఉన్న మ్యాన్‌హోల్‌ను పరిశీలించి, అవసరమైన శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రమాద ప్రాంతం చుట్టూ తాత్కాలిక బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు రాత్రివేళల్లో స్పష్టంగా కనిపించే హెచ్చరికలు, అవసరమైన వెలుతురు కల్పించాలని కోరుతున్నారు. బోరబండ నుంచి మాదాపూర్ వైపు వెళ్లే మార్గంలో రహదారి పరిస్థితి, డ్రైనేజీ, మ్యాన్‌హోల్స్, వీధి దీపాలు, వర్షపు నీటి పారుదల వంటి అంశాలపై సమగ్ర పరిశీలన నిర్వహించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి స్వయంగా ఆకస్మిక తనిఖీ చేయాలన్న స్థానికుల డిమాండ్ కూడా వినిపిస్తోంది. అయితే ప్రస్తుతం ప్రధానంగా అవసరమయ్యేది ప్రమాదాన్ని నివారించే తక్షణ చర్యలేనని స్థానికులు చెబుతున్నారు. ఒక కర్రకు నారింజ రంగు వస్త్రం కట్టి ప్రమాదాన్ని సూచించడం తాత్కాలిక హెచ్చరిక మాత్రమే.. తెరిచి ఉన్న మ్యాన్‌హోల్‌కు శాశ్వత పరిష్కారం చూపించడమే అసలు భద్రత.

కొర్రపాటి నాగరాజాచార్య
సీనియర్ జర్నలిస్ట్



జీతం చేతికి రాకముందే ఒక పన్ను.. జీతం వచ్చిన తర్వాత ఖర్చు చేస్తే మరో పన్ను.. ఇల్లు కొంటే ఇంకో పన్ను.. కారు కొంటే రోడ్డు పన్ను.. పెట్రోల్ పోయిస్తే ఇంధన పన్ను.. పెట్టుబడి పెడితే మూలధన లాభాల పన్ను.. చివరకు మనం కొనే ప్రతి వస్తువులోనూ పన్ను భాగమే! ఇలా సంపాదించిన ప్రతి రూపాయిలోనూ, ఖర్చు చేసిన ప్రతి రూపాయిలోనూ ప్రజలపై పన్ను భారం పడుతున్నా.. ఆ డబ్బుతో ప్రజల జీవితాలు ఎందుకు అదే స్థాయిలో మెరుగుపడటం లేదు? దేశ ఖజానాకు పన్నుల రూపంలో భారీగా ఆదాయం వస్తోంది. అయినా ప్రభుత్వాలకు అప్పులు తప్పడం లేదు. అప్పులపై వడ్డీలకే భారీ మొత్తం వెళ్తోంది. మరోవైపు విద్య, వైద్యం వంటి ప్రజల జీవితాలను నేరుగా మార్చే రంగాలకు దక్కుతున్న వాటాపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రోడ్లు వేసినా కొద్దికాలానికే గుంతలు.. ప్రభుత్వ ఆసుపత్రులున్నా ప్రైవేట్ వైద్యం తప్పని పరిస్థితి.. ప్రభుత్వ విద్య ఉన్నా ప్రైవేట్ ఫీజుల భారం.. అయితే సమస్య పన్ను వసూలులోనా? పన్ను ఎగవేతలోనా? ప్రభుత్వ ఖర్చులోనా? లేక జవాబుదారీతనం లేని వ్యవస్థలోనా? తెలుగు ప్రజల జేబుల నుంచి వెళ్తున్న ప్రతి రూపాయి ఎక్కడికి వెళ్తోంది? నేరం ఎవరిది.. శిక్ష మాత్రం ప్రజలకే ఎందుకు? అసలు లెక్క ఇదే..!

వెన్ను పోటును మించిన పన్ను పోటు

పన్ను పీకేస్తారా? | **టాక్స్ కడుతున్న ప్రజలకే.. శిక్ష..!?** | **పెరుగుతున్న భారం.. బతికేదెలా?**

ప్రజల జేబు నుంచి పన్ను.. దేశ ఖజానాలోకి డబ్బు.. కానీ అదే స్థాయిలో ప్రజల జీవన ప్రమాణం ఎందుకు పెరగడం లేదు? ఇదే ఇప్పుడు భారత పన్ను వ్యవస్థపై నిలవాల్సిన అసలు ప్రశ్న. పన్ను చెల్లించడం పౌరుడి బాధ్యతే. ప్రభుత్వానికి ఆదాయం అవసరమే. కానీ ప్రజలు చెల్లించే ప్రతి రూపాయికి సరైన ప్రతిఫలం కనిపించాలన్నది అంతకంటే పెద్ద ప్రజాస్వామ్య బాధ్యత. కేంద్ర బడ్జెట్ 2026-27 ప్రకారం స్థూల పన్ను ఆదాయం ₹44.04 లక్షల కోట్లుగా అంచనా వేశారు. అందులో ప్రత్యక్ష పన్నుల వాటా ₹26.97 లక్షల కోట్లు. కేంద్ర ప్రభుత్వానికి నికర పన్ను ఆదాయం ₹28.67 లక్షల కోట్లుగా అంచనా ఉంది. అంటే పన్నుల వసూళ్ల పరిమాణం ఎంత భారీగా ఉందో అర్థమవుతుంది. ఇక్కడే ప్రజల అసలు సందేహం మొదలవుతుంది. పన్ను పెరుగుతోంది.. ఆదాయం పెరుగుతోంది.. ఆ డబ్బుతో ప్రజల జీవితాల్లో ఎంత మార్పు వస్తోంది? జీతం తీసుకునే ఉద్యోగి ఆదాయపన్ను చెల్లిస్తాడు. వస్తువు కొంటే జీఎస్టీ చెల్లిస్తాడు. పెట్రోల్ పోయిస్తే పన్ను చెల్లిస్తాడు. ఇల్లు కొంటే స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ చెల్లిస్తాడు. వాహనం కొంటే రోడ్డు పన్ను చెల్లిస్తాడు. ఆస్తిపై ప్రాపర్టీ ట్యాక్స్ ఉంటుంది. విద్యుత్ బిల్లులో డ్యూటీ ఉంటుంది. పెట్టుబడులపై కూడా పన్నులు ఉంటాయి. అంటే సంపాదించినప్పుడు ఒకసారి, ఖర్చు చేసినప్పుడు మరోసారి, ఆస్తి కొనుగోలు చేసినప్పుడు ఇంకోసారి ప్రజల జేబుపై భారం పడుతుంది. పన్ను చెల్లించడమే సమస్య కాదు. పన్ను చెల్లించిన తర్వాత కూడా మంచి వైద్యం, నాణ్యమైన విద్య, సురక్షిత రహదారులు, పరిశుభ్రమైన నగరాలు, తాగునీరు, సమర్థవంతమైన ప్రజా రవాణా కోసం మళ్లీ వ్యక్తిగతంగా ఖర్చు చేయాల్సి రావడమే అసలు సమస్య.

• కేంద్రం నుంచి రాష్ట్రం వరకు పన్నుల వల

పన్ను వ్యవస్థను కేవలం ఆదాయపన్నుతో అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. కేంద్ర స్థాయిలో ఆదాయపన్ను, సర్‌చార్జ్, హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సెస్, సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్, మూలధన లాభాల పన్ను, డివిడెండ్‌పై పన్ను, జీఎస్టీ, కస్టమ్స్ డ్యూటీ, ఎక్సైజ్ డ్యూటీ వంటి పన్నులు ఉన్నాయి. ఆదాయపన్నుపై 4 శాతం హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సెస్ వసూలు చేస్తున్నట్లు కేంద్ర బడ్జెట్ పత్రాలు స్పష్టం చేస్తున్నాయి. రాష్ట్ర స్థాయిలో పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్, మద్యం ఎక్సైజ్, ఆస్తులపై స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలు, వాహనాలపై రోడ్డు పన్ను, కొన్ని రాష్ట్రాల్లో ప్రొఫెషనల్ ట్యాక్స్, విద్యుత్ డ్యూటీ వంటి భారం ఉంటుంది. స్థానిక సంస్థల స్థాయిలో ప్రాపర్టీ ట్యాక్స్, నీటి ఛార్జీలు, మురుగునీటి ఛార్జీలు వంటి చెల్లింపులు ఉంటాయి. ఇది ప్రజలకు కనిపించని పన్నుల గొలుసు. ఒక కుటుంబం నెల జీతం చేతికి వచ్చిందంటే మొత్తం డబ్బు దాని సొంతం కాదు. ఆదాయపన్ను చెల్లించిన తర్వాత మిగిలిన డబ్బుతో మార్కెట్‌లో కొనుగోలు చేస్తే జీఎస్టీ చెల్లించాలి. వాహనంతో ప్రయాణిస్తే ఇంధన పన్ను, టోల్ ఉంటుంది. ఇల్లు ఉంటే ఆస్తి పన్ను, విద్యుత్ బిల్లులు ఉంటాయి. ఆస్తి కొనుగోలు చేస్తే మరో భారీ చెల్లింపు ఉంటుంది. ఈ వ్యవస్థలో ఎక్కువగా నిర్దిష్ట జీతం పొందే మధ్యతరగతి, వినియోగదారులు సులభంగా పన్ను వ్యవస్థలోకి వస్తారు. వ్యాపారాలు, స్వయం ఉపాధి రంగాల్లో వాస్తవ ఆదాయాన్ని పూర్తిగా పన్ను పరిధిలోకి తీసుకురావడం మాత్రం పెద్ద సవాలు. అందుకే పరిష్కారం ఇప్పటికే పన్ను చెల్లిస్తున్న వారిపై మరింత భారం వేయడం కాదు; పన్ను పరిధిని న్యాయంగా విస్తరించడం. పన్ను వ్యవస్థలో పారదర్శకత, ఫీజిబిలిటీ, సమానత్వం లేకపోతే నిజాయితీగా చెల్లించే వ్యక్తికే వ్యవస్థ శిక్షగా మారే ప్రమాదం ఉంది.

• పన్ను పెరిగింది.. ఖర్చు మాత్రం ప్రజలదే


పన్నుల భారాన్ని ఒక సాధారణ కుటుంబం జీవితంలో చూస్తే అసలు ప్రభావం స్పష్టమవుతుంది. నెల జీతం నుంచి ఆదాయపన్ను వెళ్లిపోతుంది. మిగిలిన డబ్బుతో ఆహారం, దుస్తులు, మొబైల్, విద్య, ప్రయాణం, ఇంధనం వంటి అవసరాలు తీర్చుకుంటే పరోక్ష పన్నులు చెల్లించాల్సి వస్తుంది. పిల్లల విద్యకు ప్రైవేట్ స్కూల్, ఆరోగ్యానికి ప్రైవేట్ ఆసుపత్రి, ప్రయాణానికి వ్యక్తిగత వాహనం, తాగునీటికి ఫిల్టర్, భద్రతకు అదనపు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి వస్తే ప్రజలపై రెండో భారం పడుతుంది. ఒకసారి పన్ను చెల్లించి ప్రభుత్వ సేవ పొందాల్సిన చోట, పన్ను చెల్లించిన తర్వాత అదే సేవను ప్రైవేట్‌గా కొనుగోలు చేయాల్సి రావడం ప్రజల అసంతృప్తికి ప్రధాన కారణం. కేంద్ర బడ్జెట్ 2026-27లో మొత్తం రెవెన్యూ వ్యయం ₹41.25 లక్షల కోట్లుగా అంచనా. అందులో వడ్డీ చెల్లింపులకే ₹14.04 లక్షల కోట్లు కేటాయించారు. అంటే గతంలో తీసుకున్న అప్పులపై వడ్డీ చెల్లించడానికే భారీ మొత్తాన్ని ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉంది. ఈ పరిస్థితి ఎందుకు ముఖ్యమంటే, వడ్డీకి వెళ్లే ప్రతి రూపాయి భవిష్యత్తులో ఇతర అవసరాలకు వినియోగించే అవకాశాన్ని తగ్గిస్తుంది. రక్షణ, మౌలిక వసతులు, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి వంటి రంగాలకు ఖర్చు అవసరమే. కానీ ఆరోగ్యం, విద్య వంటి రంగాల్లో ప్రజలు నేరుగా అనుభవించే నాణ్యత పెరగకపోతే పన్నులపై ప్రశ్నలు రావడం సహజం. ప్రజలు అడుగుతున్నది పన్ను ఎందుకు వసూలు చేస్తున్నారని కాదు... పన్ను తీసుకున్న తర్వాత నా జీవితంలో మార్పు ఎక్కడ కనిపిస్తోందన్నదే.

• పాలకులు ఎందుకు పట్టించుకోవడం లేదన్న ప్రశ్న

ఇక్కడ ఒక విషయాన్ని స్పష్టంగా చెప్పాలి. పన్నుల భారాన్ని చూసి పాలకులు ఉద్దేశపూర్వకంగా ప్రజలను పట్టించుకోవడం లేదని నేరుగా తేల్చడం సరైంది కాదు. కానీ ప్రజలకు ఎందుకు ఇలాంటి భావన కలుగుతోందన్నది మాత్రం పరిశీలించాల్సిందే. ప్రభుత్వ ఖర్చుల్లో వడ్డీ భారం పెరగడం, రక్షణ అవసరాలు, సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల పెట్టుబడులు, రాష్ట్రాలకు నిధుల బదిలీలు, పరిపాలనా ఖర్చులు వంటి అనేక బాధ్యతలు ఉన్నాయి. 2026-27లో రాష్ట్రాలకు పన్నుల వాటా 41 శాతంగా కొనసాగించాలని నిర్ణయించినట్లు కేంద్ర బడ్జెట్ పత్రాలు చెబుతున్నాయి. అంటే కేంద్రం వసూలు చేసే మొత్తం డబ్బు కేంద్రం దగ్గరే ఉండదు. అయినా ప్రజలకు కావాల్సిన ప్రశ్న మాత్రం మారదు... డబ్బు ఎక్కడికి వెళ్లింది? ఎంత ఖర్చయింది? ఎంత ఫలితం వచ్చింది? ఒక రహదారి నిర్మాణానికి ₹100 కోట్లు కేటాయిస్తే అది నిజంగా ఎంత ఖర్చయింది? నిర్మించిన రహదారి ఎన్ని సంవత్సరాలు నిలిచింది? నాణ్యత ఎందుకు పడిపోయింది? ఒక ఆసుపత్రికి నిధులు కేటాయిస్తే వైద్యులు, మందులు, పరికరాలు అందుబాటులో ఉన్నాయా? ఒక పాఠశాలకు నిధులు వస్తే పిల్లలకు నాణ్యమైన బోధన అందుతోందా? ఇవే ప్రజల అసలు ప్రశ్నలు. నేరం ఎవరిది? శిక్ష ఎవరికీ? పన్ను ఎగవేసినవాడు తప్పు చేస్తే చర్య తప్పదు. ప్రభుత్వ డబ్బు వృథా చేసిన వ్యవస్థపైనా అదే స్థాయి బాధ్యత ఉండాలి. కాంట్రాక్టర్ నాణ్యత లేకుండా పని చేస్తే బాధ్యత ఉండాలి. పర్యవేక్షణ విఫలమైతే అధికారులపై జవాబుదారీతనం ఉండాలి. ప్రజల డబ్బు అంటే ప్రభుత్వ డబ్బు కాదు... అది పన్ను చెల్లించిన ప్రజల డబ్బు. అందుకే ప్రతి రూపాయి ఖర్చుకు లెక్క చెప్పే వ్యవస్థ అవసరం.


• తెలుగు ప్రజలపై కనిపిస్తున్న రెండో భారం

ఈ పన్ను వ్యవస్థ ప్రభావం తెలుగు రాష్ట్రాల్లో మరింత స్పష్టంగా కనిపిస్తుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగులు ఆదాయపన్ను చెల్లించడమే కాకుండా రోజువారీ వినియోగంపై జీఎస్టీ, ఇంధనంపై రాష్ట్ర పన్నులు, విద్యుత్ బిల్లులు, ఆస్తి పన్నులు, వాహన పన్నులు, రహదారి టోల్‌లు వంటి అనేక చెల్లింపులు చేస్తున్నారు. హైదరాబాద్ వంటి నగరాల్లో మధ్యతరగతి కుటుంబానికి ఇల్లు, పిల్లల విద్య, వైద్యం, రవాణా, ఇంధనం, అద్దె, విద్యుత్ వంటి ఖర్చులు ఇప్పటికే భారీగా ఉన్నాయి. ఆ ఖర్చులపై పన్నులు చేరితే కుటుంబ పొదుపు తగ్గుతుంది. పొదుపు తగ్గితే పెట్టుబడి తగ్గుతుంది. పెట్టుబడి తగ్గితే భవిష్యత్తు ఆర్థిక భద్రత బలహీనమవుతుంది. ఇదే పన్నుల అసలు సామాజిక ప్రభావం. ఒక కుటుంబం పన్ను చెల్లించినంత మాత్రాన దాని జీవన ప్రమాణం పెరగదు. పన్ను డబ్బుతో ప్రభుత్వం అందించే సేవల నాణ్యత పెరిగినప్పుడే పన్ను చెల్లింపుకు అర్థం ఉంటుంది. దేశ స్థాయిలో కూడా ఇదే విరుద్ధ చిత్రం కనిపిస్తోంది. ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం 2025 నివేదిక ప్రకారం భారతదేశం 2023 డేటాతో 193 దేశాల్లో 130వ స్థానంలో ఉంది. అదే నివేదికలో భారత జీవనప్రమాణ సూచికలో పురోగతి ఉన్నట్లు చెబుతున్నప్పటికీ, అసమానతలు ఇంకా పెద్ద సవాలుగా ఉన్నాయని పేర్కొంది. అంటే భారతదేశం ఆర్థికంగా ఎదగడం ఒక విషయం.. ఆ ఎదుగుదల సాధారణ కుటుంబ జీవనంలో ఎంతగా ప్రతిబింబిస్తోందన్నది మరో విషయం. తెలుగు ప్రజల ప్రశ్న కూడా ఇదే... పన్నులు చెల్లిస్తున్నాం.. మన పిల్లలకు మంచి విద్య ఎప్పుడు? మన కుటుంబానికి భద్రమైన వైద్యం ఎప్పుడు? మన నగరాలకు శుభ్రమైన వాతావరణం ఎప్పుడు?



• అసలు నేరం ఎక్కడ? పరిష్కారం ఏమిటి?

ఈ కథలో అసలు నిందితుడిని ఒక పార్టీగా, ఒక ప్రభుత్వంగా చూపించడం సులభం. కానీ సమస్య అంతకంటే లోతైనది. మొదటి తప్పు పన్ను వ్యవస్థలో ఉన్న అసమానత. రెండో తప్పు పన్ను ఎగవేత. మూడో తప్పు ప్రజా ధన వినియోగంలో పారదర్శకత లోపం. నాలుగో తప్పు ఫలితాలను కొలవకుండా ఖర్చు చేయడం. ఐదో సమస్య అప్పులపై పెరుగుతున్న వడ్డీ భారం. ఆదాయపన్ను రిటర్న్ దాఖలు చేయని ప్రతి వ్యక్తిని పన్ను ఎగవేతదారుడిగా పరిగణించడం సరైంది కాదు... పన్ను చెల్లించాల్సిన ఆదాయ పరిమితి, ఆదాయ స్వభావం, మినహాయింపులు వంటి అంశాలు ఉంటాయి. కాబట్టి "కొద్ది శాతం మాత్రమే పన్ను చెల్లిస్తున్నారు, మిగిలినవారు అందరూ పన్ను ఎగవేస్తున్నారు" అన్న సరళీకరణను జాగ్రత్తగా చూడాలి. అసలు అవసరం ఏమిటంటే వాస్తవ ఆదాయం ఉన్న ప్రతి వర్గాన్ని న్యాయంగా పన్ను పరిధిలోకి తీసుకురావడం. అదే సమయంలో ఇప్పటికే పన్ను చెల్లిస్తున్న ఉద్యోగి, మధ్యతరగతి కుటుంబంపై నిరంతరం అదనపు భారం మోపకుండా వ్యవస్థను సమతుల్యం చేయాలి. ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి పెద్ద ప్రాజెక్టుకు కేటాయింపు ఎంత, విడుదల ఎంత, ఖర్చు ఎంత, పని పూర్తయిందా, నాణ్యత ఎలా ఉంది, ప్రజలకు ఫలితం ఏమిటి అనే వివరాలు బహిరంగంగా కనిపించాలి. పన్ను చెల్లింపుదారుడికి ఇది హక్కు. పన్ను చెల్లించడం పౌరుడి బాధ్యత అయితే, ఆ డబ్బును సమర్థంగా ఖర్చు చేయడం పాలక వ్యవస్థ బాధ్యత. ప్రజల నుంచి వసూలు చేసే ప్రతి రూపాయికి ప్రతిఫలంగా ప్రజల జీవితంలో విలువ పెరగాలి. లేదంటే పన్ను కేవలం ఆదాయ వనరుగా మిగిలిపోతుంది. పన్ను చెల్లించిన ప్రజలే చివరికి రెండుసార్లు చెల్లించే పరిస్థితి కొనసాగుతుంది. ఇదే అసలు ప్రశ్న... నేరం ఎవరిదైనా కావచ్చు.. కానీ శిక్ష మాత్రం సామాన్య ప్రజలకే ఎందుకు?





ఢిల్లీలో జంతర్‌మంతర్ నుంచి హైదరాబాద్ గాంధీభవన్ వరకు ఆందోళనల సెగ... సుప్రీంకోర్టు గడప దాటిన ఆరోపణలు.. ఎన్నికల సంఘం చుట్టూ ముసురుకుంటున్న అనుమానాలు... సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై ప్రతిపక్షాల నేరుగా దాడి! అసలు ఏం జరుగుతోంది? ఫామ్ 6లో మార్పులు ఎవరు చేశారు? సర్‌లో ఓటర్ల పేర్లు ఎలా తొలగించారు? ఎన్నికల సంఘం నిర్ణయాలు ఏకపక్షంగా జరిగాయా? ఈ ప్రశ్నలతో దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు ఈసీ, కేంద్రానికి నోటీసులు జారీ చేయడం ఇప్పుడు దేశ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. కోర్టు మాత్రం ఆరోపణలను ఇప్పుడే నిజమని తేల్చలేదు.. రికార్డులు పరిశీలించి, ఎన్నికల సంఘం సమాధానం విన్న తర్వాతే నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది. మరోవైపు కాంగ్రెస్ సీఈసీ రాజీనామా, సర్ రద్దు... బ్యాలెట్ పేపర్లపై ఎన్నికలు నిర్వహించాలంటూ మూడు డిమాండ్లతో పోరును ముమ్మరం చేసింది. జైరాం రమేశ్ “జీ-2” వ్యాఖ్యలతో దాడిని మరింత తీవ్రం చేశారు. ఎన్ఎస్‌యూఐ నుంచి ఇండియా కూటమి వరకు రోడ్డెక్కాయి. తెలంగాణలో ఫామ్-7లపై కొత్త ఆరోపణలు.. కేరళలో పాత కేసులపై న్యాయపరమైన కదలికలు.. అన్నీ ఒకేసారి తెరపైకి వచ్చాయి. ఇది కేవలం సీఈసీపై పోరా? లేక భారత ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసానికి జరుగుతున్న అసలు పరీక్షా? అసలు లోపల ఏం జరుగుతోంది?

ఓటు సమరం

ఎందుకు? ఏమిటి? ఎలా?



వ్యవస్థపై యుద్ధమా?

సీఈసీపై పోరు.. సుప్రీంకోర్టు ముందుకు రాజకీయ తుఫాను

ఓటర్ల జాబితా సవరణ చుట్టూ దేశ రాజకీయాల్లో కొత్త ఉద్రిక్తత మొదలైంది. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ, సర్ ప్రక్రియలో ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాలు, ముఖ్య ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పాత్రపై ప్రతిపక్షాలు తీవ్ర ఆరోపణలు చేస్తున్న వేళ సుప్రీంకోర్టు సోమవారం కీలక పరిణామానికి తెరతీసింది. జ్ఞానేశ్ కుమార్ నేతృత్వంలోని ఎన్నికల సంఘం ఇద్దరు ఎన్నికల కమిషనర్ల ఆమోదం లేకుండానే కొన్ని నిర్ణయాలు తీసుకుందని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్లపై కోర్టు ఎన్నికల సంఘానికి, కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. వారం రోజుల్లో సమాధానం ఇవ్వాలని సూచించింది. అయితే ఈ దశలో కోర్టు ఆరోపణలను నిజమని తేల్చలేదు. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం తమ ముందు ఉన్నవి ప్రస్తుతానికి పత్రికా కథనాల ఆధారమైన ఆరోపణలేనని స్పష్టం చేసింది. జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ కూడా అన్ని ఈసీ నిర్ణయాలు ఏకగ్రీవంగా లేదా మెజారిటీతోనే తీసుకున్నట్లు కోర్టు భావిస్తోందని తెలిపారు. దీంతో అసలు పోరాటం రెండుదారుల్లో సాగుతోంది. ఒకటి ఓటరు హక్కుల రక్షణపై న్యాయపోరాటం. మరొకటి ఎన్నికల సంఘం స్వతంత్రతపై రాజకీయ పోరాటం. ఈ రెండు అంశాలు కలిసిపోవడంతో దేశ ప్రజాస్వామ్య వ్యవస్థపై విశ్వాసం... ఓటర్ల జాబితా విశ్వసనీయత, ఎన్నికల నిర్వహణ విధానం గురించి పెద్ద చర్చ మొదలైంది. అందుకే ఇప్పుడు అందరి చూపు సుప్రీంకోర్టు తదుపరి విచారణపైనే ఉంది.

ఈ పరిణామాలపై వచ్చిన ప్రధాన అంశాలు తాజా నివేదికలోనూ నమోదయ్యాయి. ఈ దశలో కోర్టు చేసిన వ్యాఖ్యలను తుది తీర్పుగా భావించకూడదు. నోటీసు అంటే ఆరోపణలపై సమాధానం కోరిన ప్రక్రియ మాత్రమే. అయినా ఈ నోటీసు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఎందుకంటే ఎన్నికల నిర్వహణపై ప్రజల్లో ఇప్పటికే ఉన్న అనుమానాలు న్యాయస్థానం ముందుకు చేరాయి. ఎన్నికల సంస్థపై వచ్చే ప్రతి ఆరోపణకు ఆధారాలు, రికార్డులు, స్పష్టమైన విధానాలు అవసరమనే విషయం ఈ విచారణ గుర్తుచేస్తోంది.

• ఫామ్ 6 మార్పులపై కోర్టు కీలక స్పష్టత

కొత్త ఓటరుగా పేరు నమోదు చేసుకునే వ్యక్తి కోసం ఉపయోగించే ఫామ్ 6 చుట్టూ వివాదం ఈ వ్యవహారానికి కేంద్రంగా మారింది. సర్ సమయంలో ఫామ్ 6కు అదనపు ప్రకటనలు జోడించబడ్డాయని పిటిషనర్లు ఆరోపించారు. గత సర్ జాబితాల్లో దరఖాస్తుదారు, తల్లిదండ్రులు లేదా తాతముత్తాతల పేర్లు నమోదయ్యాయా...? అనే వివరాలను వెల్లడించే అంశాలు జోడించారా అని వాదించారు. ఈ ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం కొత్త ఓటరు దరఖాస్తుకు తప్పనిసరి షరతుగా మారిందని కూడా పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే అక్టోబర్ 5 విచారణలో సుప్రీంకోర్టు ఈ మార్పులు తాము చేయలేదని స్పష్టంగా చెప్పింది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, ఫామ్ 6లో మార్పులు కోర్టు చేయలేదని తేల్చిచెప్పారు. ఫామ్ 6 ఎన్నికల నమోదు నిబంధనల షెడ్యూల్‌లో ఉన్న చట్టబద్ధ పత్రం కావడంతో దానిలో మార్పులు సరైన చట్టపరమైన ప్రక్రియ ద్వారా జరగాలనే వాదన కూడా విచారణలో వచ్చింది. ఈ వ్యాఖ్యల తర్వాత కాంగ్రెస్ ఎన్నికల సంఘంపై మరింత తీవ్రంగా దాడి చేసింది. రాహుల్ గాంధీ తన సామాజిక మాధ్యమ ఖాతాలో ఎన్నికల సంఘం సెప్టెంబర్ 26 ప్రకటనను ప్రస్తావిస్తూ, సుప్రీంకోర్టు ఆమోదించిందని చెప్పిన మార్పులపై కోర్టు ఇప్పుడు భిన్నమైన స్పష్టత ఇచ్చిందని ఆరోపించారు. జైరాం రమేశ్ కూడా ఇదే అంశాన్ని తీవ్రంగా లేవనెత్తారు. అయితే ఇవి కాంగ్రెస్ చేసిన రాజకీయ ఆరోపణలే... కోర్టు ఇంకా ఎన్నికల సంఘం ఉద్దేశపూర్వకంగా చట్టవిరుద్ధంగా వ్యవహరించిందని తుది నిర్ణయం ఇవ్వలేదు. కోర్టు రికార్డులను పరిశీలించి, ఎన్నికల సంఘం వివరణ విన్న తర్వాతే తదుపరి నిర్ణయానికి వెళ్లనుంది. ఫామ్ 6 వివాదం అందుకే న్యాయపరమైన ప్రశ్నగా మారింది. కొత్త ఓటరుగా నమోదయ్యే యువతకు ఈ ఫామ్ ప్రత్యేక ప్రాధాన్యం కలిగి ఉంటుంది. అందుకే దరఖాస్తు ప్రక్రియలో కొత్త షరతులు చేర్చారా...? అవి ఏ అధికారిక ఆదేశంతో వచ్చాయనే ప్రశ్నలు సహజంగా తలెత్తాయి. ఎన్నికల జాబితా సవరణలో పారదర్శకత లేకపోతే అనుమానాలు పెరుగుతాయి. అదే సమయంలో ప్రతి మార్పును అక్రమమని తేల్చే ముందు సంబంధిత పత్రాలు చూడాలి. ఈ అంశంలో కోర్టు ఇప్పుడు అదే పత్రాలను పరిశీలించే దిశగా వెళ్తోంది.

• సీఈసీపై కాంగ్రెస్ దాడి.. జైరాం రమేశ్ జీ-2 వ్యాఖ్యలు

సుప్రీంకోర్టు నోటీసుల తర్వాత కాంగ్రెస్ తన రాజకీయ దాడిని మరింత పెంచింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే... జ్ఞానేశ్ కుమార్ రాజీనామా, సర్ రద్దు, ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్లపై ఎన్నికలు నిర్వహించడం అనే మూడు అంశాలను తమ పార్టీ “నాన్ నెగోషియబుల్ డిమాండ్లు”గా ప్రకటించారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తలు, ఇండియా కూటమి భాగస్వాములు ఈ అంశాలపై నిరసనలు చేస్తున్నారని ఆయన చెప్పారు. మరోవైపు కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇంచార్జి జైరాం రమేశ్ జ్ఞానేశ్ కుమార్‌పై అత్యంత ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఆయన ఉపయోగించిన “జీ2” పదం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాను సూచించే రాజకీయ పదప్రయోగంగా కాంగ్రెస్ వర్గాల్లో వినిపిస్తోంది. జ్ఞానేశ్ కుమార్ ఆదేశాలను అమలు చేసే వ్యక్తిగా మారితే దేశానికి భారంగా మారతారని రమేశ్ ఆరోపించారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఉజ్జల్ భూయాన్ ఓటు హక్కు కోల్పోయేలా చేసే ప్రక్రియ లక్షలాది మందిని ఓటు హక్కు లేని పౌరులుగా మార్చితే అది రాజ్యాంగ వ్యవస్థకు విరుద్ధమవుతుందని వ్యాఖ్యానించిన విషయాన్ని కూడా కాంగ్రెస్ తన వాదనకు ఆధారంగా ప్రస్తావించింది. అయితే జస్టిస్ భూయాన్ వ్యాఖ్యలు, కాంగ్రెస్ రాజకీయ ఆరోపణలు ఒకటే విషయంగా చూడకూడదు. ఒకటి న్యాయపరమైన రాజ్యాంగ చర్చ... మరోటి ప్రతిపక్ష పార్టీ రాజకీయ అభిప్రాయం. సీఈసీపై వచ్చిన ఆరోపణలు నిరూపితమయ్యాయని ఇప్పుడే చెప్పే స్థితి లేదు. సుప్రీంకోర్టు కూడా ఇప్పటివరకు మధ్యంతర ఉపశమనం ఇవ్వలేదు. రికార్డులు పరిశీలించిన తర్వాతే తదుపరి చర్యపై నిర్ణయం తీసుకుంటామని కోర్టు తెలిపింది. అందుకే జైరాం రమేశ్ విమర్శలు రాజకీయంగా ఎంత తీవ్రంగా ఉన్నా... వాటి నిజానిజాలు తేల్చాల్సింది న్యాయపరమైన పరిశీలన ద్వారానే. రాజకీయ వేదికపై పదజాలం మరింత తీవ్రంగా మారుతున్నా, న్యాయస్థానంలో నిరూపించాల్సిన అంశాలు వేరుగా ఉంటాయి. సీఈసీపై వ్యక్తిగత ఆరోపణలు, సంస్థాగత నిర్ణయాలపై అభ్యంతరాలు, ప్రభుత్వంతో ఎన్నికల సంఘం సంబంధాలపై అనుమానాలు ఒక్కొక్కటి విడిగా పరిశీలించాల్సి ఉంటుంది. కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలకు ఎన్నికల సంఘం సమాధానం ఇవ్వాల్సిన దశ రానుంది. ఆ సమాధానాలు, అధికారిక రికార్డులు, కోర్టు పరిశీలన కలిసిన తర్వాతే అసలు చిత్రంపై స్పష్టత రావచ్చు.

• ఢిల్లీలో వీధుల్లోకి నిరసన..

ఓటు హక్కే కేంద్రబిందువు

కోర్టు విచారణ సాగుతున్న సమయంలో రాజకీయ పోరాటం వీధుల్లోకి వచ్చింది. ఢిల్లీలో సోమవారం, జంతర్ మంతర్ సమీపంలో ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ నిరసన చేపట్టారు. మరో చోట ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు తెల్లని వస్త్రాలపై పడుకుని “చనిపోయిన శరీరాలు”గా ప్రదర్శన నిర్వహించారు. ఓటు దొంగతనం పేరుతో ప్రజల గొంతును అణచలేరనే నినాదాలు చేశారు. ఇండియా కూటమి కూడా ఢిల్లీలోని ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం ఎదుట నిరసనకు సిద్ధమైంది. ఇదే సమయంలో జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయంలో ఏఐఎస్ఏ జాతీయ అధ్యక్షురాలు నేహా బోరా పశ్చిమ బెంగాల్‌తో పాటు దేశవ్యాప్తంగా ఓటర్ల హక్కుల అంశాలపై మాట్లాడారు. హైదరాబాద్‌లోనూ కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. తెలంగాణ కాంగ్రెస్ ఎన్నికల సమన్వయ కమిటీ హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసి, కొన్ని నియోజకవర్గాల్లో ముందే నింపిన ఫామ్ 7ల ద్వారా నిజమైన ఓటర్ల పేర్లు తొలగించే ప్రయత్నం జరిగిందని ఆరోపించింది. ముషీరాబాద్, బహదూర్‌పురా, గోషామహల్ ప్రాంతాల్లో ఇలాంటి దరఖాస్తులు కనిపించాయని కాంగ్రెస్ తెలిపింది. వాటి వెనుక ఎవరు ఉన్నారు. ఓటర్ల వివరాలు ఎలా పొందారు. ఫారాలు ఎవరు ముద్రించారు, ఎక్కడ పంపిణీ చేశారు అనే అంశాలపై సిట్ దర్యాప్తు కోరింది. అయితే ఇవన్నీ ప్రస్తుతం ఆరోపణల దశలోనే ఉన్నాయి. ఎన్నికల జాబితాలో పేరు తొలగించడానికి అధికారిక పరిశీలన ప్రక్రియ ఉంటుంది. కాబట్టి ఆరోపణలు నిజమని నిర్ధారించేందుకు పోలీసు, ఎన్నికల అధికారులు ఆధారాలు పరిశీలించాల్సి ఉంటుంది. ఈ నిరసనలన్నింటి మధ్య ప్రధాన ప్రశ్న మాత్రం ఒక్కటే... అర్హుడైన పౌరుడి ఓటు హక్కు ఏ పరిస్థితుల్లోనూ అనవసరంగా కోల్పోకూడదు. ప్రజా నిరసనల్లో వినిపిస్తున్న మాటల వెనుక ఓటు హక్కుపై ఆందోళన ప్రధానంగా కనిపిస్తోంది. ఒక పేరు జాబితా నుంచి తొలగితే ఎన్నికల రోజున ఆ వ్యక్తి ఎదుర్కొనే ఇబ్బంది చిన్న విషయం కాదు. అదే సమయంలో అర్హత లేని పేర్లు, మరణించిన వ్యక్తుల పేర్లు, డూప్లికేట్ నమోదులు తొలగించాల్సిన అవసరం కూడా ఎన్నికల వ్యవస్థలో ఉంటుంది. కాబట్టి సవరణ ప్రక్రియలో అసలు సమస్య తొలగింపేనా, లేక సరైన ధృవీకరణ లేకుండా జరిగే తొలగింపా అన్నది కీలక ప్రశ్నగా మారింది.

• కేరళలో పాత కేసు.. కొత్త న్యాయపరమైన మలుపు

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై రాజకీయ విమర్శలు కొనసాగుతున్న సమయంలో కేరళలో మరో న్యాయపరమైన అంశం తెరపైకి వచ్చింది. ఆయన గతంలో కేరళ పబ్లిక్ వర్క్స్ శాఖ కార్యదర్శిగా పనిచేసిన కాలానికి సంబంధించిన సుమారు రెండు దశాబ్దాల నాటి కేసును రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ పరిశీలిస్తోంది. మలేషియాకు చెందిన లీ సీ బీన్ అనే ఇంజనీర్ ఆత్మహత్యకు సంబంధించిన కేసులో జ్ఞానేశ్ కుమార్‌పై చట్టపరంగా ముందుకు వెళ్లేందుకు ఎలాంటి అడ్డంకి లేదని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రాసిక్యూషన్ టి. అసఫ్ అలీ అభిప్రాయం ఇచ్చినట్లు నివేదిక పేర్కొంది. ప్రాజెక్టు నిధుల విడుదలలో ఆలస్యం, అధికారుల వేధింపుల ఆరోపణలు... ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులపై పాత కేసులో విచారణ అంశాలు ఉన్నాయి. కేరళ ప్రభుత్వం విజిలెన్స్, అవినీతి నిరోధక విభాగం ద్వారా ప్రాథమిక విచారణకు ఆదేశించినట్లు కూడా నివేదికలో ఉంది. అయితే ఇది సీఈసీగా ఆయన ప్రస్తుత పదవికి సంబంధించిన కొత్త కేసు కాదు. గత పరిపాలనా బాధ్యతలకు సంబంధించిన ఆరోపణలపై న్యాయపరమైన ప్రక్రియను పునఃప్రారంభించే ప్రయత్నం. ఈ కేసులో ఆరోపణలు రుజువయ్యాయని చెప్పే స్థితి లేదు. న్యాయ సలహా ఒక దశ మాత్రమే... దర్యాప్తు, ఆధారాల పరిశీలన, తదుపరి చట్టపరమైన చర్యలు వేర్వేరు దశలు. ఇదే సమయంలో సీఈసీకి పదవిలో ఉన్న సమయంలోనే కాదు... పదవి నుంచి తప్పుకున్న తర్వాత కూడా కొన్ని చట్టపరమైన చర్యల నుంచి రక్షణ కల్పించే 2023 చట్టంలోని సెక్షన్ 16పై సుప్రీంకోర్టులో ప్రశ్నలు వచ్చాయి. జస్టిస్ బాగ్చీ, ఇలాంటి రక్షణ న్యాయమూర్తులకు కూడా లేదని వ్యాఖ్యానించారు. ఈ అంశం ఇప్పుడు ఎన్నికల సంఘం స్వతంత్రత, జవాబుదారీతనం, రాజ్యాంగ పదవుల రక్షణపై మరింత పెద్ద చర్చకు దారి తీస్తోంది. ఒకే సమయంలో రెండు వేర్వేరు అంశాలు చర్చలోకి రావడంతో రాజకీయ వేడి మరింత పెరిగింది. ఒకటి ప్రస్తుత సీఈసీపై ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఆరోపణలు. రెండోది ఆయన గత ప్రభుత్వ బాధ్యతల సమయంలో చోటుచేసుకున్నట్లు చెప్పబడుతున్న ఘటనలు. ఈ రెండింటినీ కలిపి తుది నేర నిర్ధారణగా చూడటం సరికాదు. ప్రతి కేసుకు తనదైన ఆధారాలు, విచారణ, చట్టపరమైన ప్రమాణాలు ఉంటాయి. కేరళలో తాజా చర్యలు కూడా ఆ ప్రక్రియలో ఒక ప్రారంభ దశగానే చూడాలి.

• ఇది ఓటు పోరా.. వ్యవస్థపై విశ్వాస పోరా?

ఇప్పుడు అసలు ప్రశ్న ఏమిటంటే ఈ మొత్తం పోరు ఎటువైపు వెళ్తుంది? ఒక వైపు కాంగ్రెస్ సీఈసీ రాజీనామా, సర్ రద్దు, బ్యాలెట్ పేపర్ డిమాండ్లతో రాజకీయ ఒత్తిడి పెంచుతోంది. మరోవైపు ఎన్నికల సంఘం తన నిర్ణయాలు చట్టబద్ధమైనవేనని... సంస్థలో భిన్నాభిప్రాయాలు సాధారణమేనని వాదిస్తున్నట్లు నివేదికలో ఉంది. సుప్రీంకోర్టు మాత్రం ఇప్పటి వరకు ఏ పక్షానా తుది తీర్పు ఇవ్వలేదు. నోటీసులు జారీ చేసి, రికార్డులు పరిశీలించి, ఎన్నికల సంఘం వివరణ కోరే దశలోనే ఉంది. కోర్టు ఒక కీలక విషయాన్ని కూడా స్పష్టం చేసింది. ఎన్నికల సంఘం నిర్ణయాలు రాజ్యాంగ పద్ధతిలో ఏకగ్రీవంగా లేదా మెజారిటీతో తీసుకోవాల్సిందే..! అదే సమయంలో ఆరోపణలు విన్న వెంటనే మొత్తం వ్యవస్థను తప్పుపట్టలేమని ధర్మాసనం సూచించింది. ఇదే కారణంగా “ఎందుకు?”, “ఏమిటి?”, “ఎలా?”, “ఎటువైపునకు?” అనే నాలుగు ప్రశ్నలు ఇప్పుడు రాజకీయ చర్చకు కేంద్రంగా మారాయి. సర్ నిజంగా అర్హులైన ఓటర్లను అన్యాయంగా తొలగించిందా? ఫామ్ 6 మార్పులు ఏ ప్రక్రియలో జరిగాయి? ఎన్నికల సంఘంలోని ఇద్దరు కమిషనర్లు చేసిన అభ్యంతరాల అసలు నేపథ్యం ఏమిటి? రాజకీయ ఆరోపణలకు పక్కన నిజమైన ఆధారాలు ఎంత ఉన్నాయి? ఈ ప్రశ్నలకు సమాధానాలు న్యాయపరమైన విచారణలో బయటపడాల్సి ఉంది. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకం. అదే సమయంలో ఎన్నికల సంఘం విశ్వసనీయత కూడా అంతే ముఖ్యమైనది. అందుకే ఈ పోరును ఒక పార్టీ గెలుపు, మరో పార్టీ ఓటమిగా కాకుండా రాజ్యాంగ సంస్థలపై ప్రజల నమ్మకం నిలబడే విధంగా చూడాలి. చివరికి కోర్టు తీర్పు, అధికారిక దర్యాప్తులు, ఎన్నికల రికార్డులే ఏ ఆరోపణ నిజమో తేల్చాలి. అప్పటివరకు రాజకీయ వాదనలు వాదనలుగానే ఉండాలి. ప్రజలకు ఇప్పుడు కావాల్సింది నినాదాల కంటే స్పష్టమైన సమాధానాలు. ఎన్నికల జాబితాలో ఎవరి పేరు ఎందుకు మారింది? ఫామ్ 6లో మార్పులకు ఆధారం ఏమిటి? ఫామ్ 7 దరఖాస్తులపై ఎలాంటి ధృవీకరణ జరిగింది? ఎన్నికల కమిషనర్ల మధ్య అభిప్రాయ భేదాలు ఉన్నాయా... ఉంటే అవి అధికారిక రికార్డుల్లో ఎలా నమోదయ్యాయి? ఈ ప్రశ్నలకు పారదర్శక సమాధానాలు వస్తే రాజకీయ అనుమానాలు తగ్గే అవకాశం ఉంటుంది. లేకపోతే ఆరోపణలు మరింత తీవ్రమయ్యే పరిస్థితి ఉంటుంది. ఈ మొత్తం పరిణామంలో చివరి మాట రాజ్యాంగం, చట్టం, ప్రజల ఓటు హక్కుదే కావాలి.





ఆకాశంలో వేల అడుగుల ఎత్తులో ప్రయాణిస్తున్న విమానం.. కింద అంతులేని ఎడారి.. చుట్టూ వందల కిలోమీటర్ల దూరం వరకు కనిపించేది ఆకాశమే. అలాంటి సమయంలో విమానం కాక్‌పిట్‌లోనే ఒక ప్రాణాంతక పోరాటం మొదలైతే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవడం కూడా కష్టం. 2026 సెప్టెంబర్ 30న దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు బయలుదేరిన ఫ్లైదుబాయ్ FZ1073 విమానంలో ఇదే జరిగింది. విమానంలో 174 మంది ప్రయాణికులు ఉన్నారు. వారిలో 27 మంది చిన్నారులు. విమానం సుమారు 34 వేల అడుగుల ఎత్తులో ప్రయాణిస్తున్న సమయంలో భారతీయ కెప్టెన్ స్మిత్ మచ్చార్‌పై ఆయన సహ పైలట్ దాడి చేశాడు. ఈ దాడిలో కెప్టెన్ తీవ్రంగా గాయపడ్డారు. విమానం ఒక్కసారిగా భారీగా కిందికి దూసుకెళ్లింది. కొన్ని నివేదికల ప్రకారం దాదాపు 17 వేల అడుగుల మేర విమానం వేగంగా దిగిపోయింది. కాక్‌పిట్‌లో జరిగిన ఈ ఘటన సాధారణ గొడవ కాదు. విమానాన్ని కూల్చే ప్రయత్నం జరిగిందన్న అనుమానంతో భద్రతా సంస్థలు దర్యాప్తు ప్రారంభించాయి. చివరకు విమానం సౌదీ అరేబియాలోని తబుక్‌లో అత్యవసరంగా ల్యాండ్ అయింది. ఈ ఘటనలో ఒక్క క్షణం ఆలస్యం జరిగి ఉంటే పరిస్థితి పూర్తిగా మారిపోయే అవకాశం ఉండేది. అందుకే ఈ ఘటన ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసింది.

- ఫ్లై దుబాయ్ ఘటనతో మొదలైన చర్చ
- పైలట్ సాహసాన్ని గుర్తించలేరా?
- రాహుల్ నోరెందుకు మెదపరన్న బీజేపీ
- ముస్లిం బుజ్జగింపు రాజకీయాల కోసమనా?

ప్రార్థనలు చంపడానికా? బతికించడానికా?

- ఒకరు అంతం చేయాలనుకున్నారు
- మరొకరు ప్రాణాలు నిలబెట్టారు

గాయాల మధ్య ప్రయాణికులే గుర్తొచ్చారు

దాడి జరిగిన వెంటనే కెప్టెన్ స్మిత్ మచ్చార్ నేల కూలిపోయారు. తలకు, చేతులకు తీవ్ర గాయాలు అయ్యాయి. రక్తస్రావం జరుగుతున్నా ఆయనకు ముందుగా గుర్తొచ్చింది తన ప్రాణం కాదు.. విమానంలోని ప్రయాణికుల ప్రాణాలు. తాను లేచి చర్య తీసుకోకపోతే విమానంలో ఉన్న 174 మందికి పైగా ప్రయాణికుల పరిస్థితి ఏం అవుతుందో ఆయనకు అర్థమైంది. అదే ఆలోచన ఆయనలో మరోసారి పోరాడే శక్తిని తీసుకొచ్చింది. కాక్‌పిట్ తలుపు తెరవడానికి ఆయన ప్రయత్నించారు. మొదటి ప్రయత్నం విఫలమైనా వెనక్కి తగ్గలేదు. చివరకు తలుపు తెరుచుకునేలా చేయగలిగారు. దీంతో ఇతర సిబ్బంది, ప్రయాణికులు కాక్‌పిట్‌లోకి చేరి దాడి చేసిన సహ పైలట్‌ను అదుపులోకి తీసుకునే అవకాశం ఏర్పడింది. ఈ సమయంలో విమానం తీవ్రంగా కిందికి దిగిపోయినట్టు విమాన ట్రాకింగ్ వివరాలు వెల్లడించాయి. పరిస్థితి అదుపులోకి వచ్చిన తర్వాత విమానాన్ని తబుక్ వైపు మళ్లించారు. అక్కడ సురక్షితంగా ల్యాండింగ్ చేశారు. ఈ మొత్తం ఘటనలో కెప్టెన్ తీసుకున్న నిర్ణయం అత్యంత కీలకంగా మారింది. గాయాలతో కదలలేని పరిస్థితిలో కూడా కాక్‌పిట్ తలుపు తెరవడం ద్వారా బయట ఉన్నవారికి లోపలికి వచ్చే మార్గం కల్పించారు. అదే చర్య వందలాది ప్రాణాలకు రక్షణగా నిలిచింది. అందుకే ఆయన ధైర్యాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రశంసిస్తున్నారు.

హనుమాన్ చాలీసా ఇచ్చిన మానసిక ధైర్యం

ఈ ఘటనలో అత్యంత భావోద్వేగానికి గురిచేసిన అంశం కెప్టెన్ స్మిత్ మచ్చార్ చెప్పిన ఒక విషయం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో జరిగిన వీడియో సంభాషణలో ఆయన తనకు ఆ సమయంలో ధైర్యం ఎలా వచ్చిందో వివరించారు. తీవ్రంగా గాయపడి నేలపై పడిపోయిన సమయంలో తాను హనుమాన్ చాలీసా పారాయణం చేస్తూనే ఉన్నానని చెప్పారు. తాను ఎప్పుడైనా క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు హనుమాన్ చాలీసా చదువుతానని వెల్లడించారు. ఆ సమయంలో కూడా అదే ప్రార్థన తనకు మానసిక బలాన్ని ఇచ్చిందని వివరించారు. అయితే ఇక్కడ అసలు విషయాన్ని స్పష్టంగా చూడాలి. కెప్టెన్ తన ప్రార్థనను ఎవరి ప్రాణాలు తీయడానికి ఉపయోగించలేదు. తన ప్రాణం కోసం పోరాడుతూనే విమానంలోని ఇతరుల ప్రాణాలను కాపాడేందుకు ఆ ప్రార్థన ద్వారా ధైర్యం పొందారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం, "నేను లేవకపోతే ఎవరూ బతకరు" అన్న ఆలోచనే ఆయనను మళ్లీ లేచేలా చేసింది. ప్రార్థన ఆయన చేతిలో ఆయుధం కాలేదు. అది ఆయన మనసులో భయాన్ని తగ్గించిన ఆధారంగా మారింది. మత విశ్వాసం వ్యక్తిగతమైనదే అయినా, ఆ విశ్వాసం ఒక వ్యక్తిని ఇతరుల ప్రాణాలను కాపాడే ధైర్యానికి నడిపించినప్పుడు దాని మానవీయ కోణం ముందుకు వస్తుంది. అందుకే ఈ ఘటనలో హనుమాన్ చాలీసా ప్రస్తావనను మతపరమైన పోటీగా కాకుండా, తీవ్ర సంక్షోభ సమయంలో ఒక పైలట్ పొందిన మానసిక బలంగా చూడాల్సిన అవసరం ఉంది.

ప్రార్థన పేరుతో ప్రాణాలు తీస్తారా?

ఈ ఘటన మరో తీవ్రమైన చర్చను కూడా ముందుకు తెచ్చింది. ఒకవైపు కాక్‌పిట్‌లో దాడి చేసిన సహ పైలట్ విమానాన్ని కూల్చే ఉద్దేశంతో వ్యవహరించాడన్న ఆరోపణలపై దర్యాప్తు కొనసాగుతోంది. మరోవైపు ఆ దాడికి ముందు అతను ప్రార్థన చేసినట్టు కెప్టెన్ స్మిత్ చెప్పినట్లు నివేదికలు వెలువడ్డాయి. ఇక్కడే మతం, తీవ్రవాదం, వ్యక్తిగత విశ్వాసం మధ్య తేడాను జాగ్రత్తగా గుర్తించాల్సిన అవసరం ఉంది. ఒక వ్యక్తి చేసిన హింసాత్మక చర్యను మొత్తం మతానికి ఆపాదించడం సరైనది కాదు. అదే సమయంలో మత విశ్వాసం పేరుతో హింసకు పాల్పడే ప్రయత్నం జరిగిందా అనే ప్రశ్నను కూడా దర్యాప్తు సంస్థలు పూర్తిగా పరిశీలించాలి. ప్రస్తుతం సహ పైలట్ ఉద్దేశం, ప్రేరణ, ఇతర సంబంధాలపై విచారణ జరుగుతోంది. ఇజ్రాయెల్ అధికారులు ఈ ఘటనను తీవ్ర భద్రతా దాడిగా అభివర్ణించగా, యూఏఈ, సౌదీ అరేబియా అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కాబట్టి దర్యాప్తు పూర్తికాకముందే తుది మతపరమైన తీర్పు ఇవ్వడం సరికాదు. అయితే ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రార్థన అనేది ప్రాణాలు కాపాడేందుకు ధైర్యం ఇవ్వగల వ్యక్తిగత విశ్వాసం కావచ్చు. ఇతరుల ప్రాణాలను తీయడానికి దాన్ని సమర్థనగా ఉపయోగించడం మాత్రం మానవ విలువలకు విరుద్ధం. కెప్టెన్ స్మిత్ కథలో కనిపించిన ప్రార్థన ఇదే భిన్నమైన అర్థాన్ని చూపిస్తోంది. ఆయన ప్రార్థన చేస్తూ పోరాడింది బతకడానికి మాత్రమే కాదు.. తనతో ప్రయాణిస్తున్న తెలియని వందలాది మందిని బతికించడానికి. ఈ తేడానే ఈ ఘటనలో అత్యంత బలమైన మానవీయ సందేశంగా నిలుస్తోంది.



ప్రధాని మోదీతో భావోద్వేగ సంభాషణ

కెప్టెన్ స్మిత్ మచ్చార్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ ఆయనతో వీడియో కాల్‌లో మాట్లాడారు. గాయాలతో ఉన్న కెప్టెన్ తన అనుభవాన్ని వివరించారు. ప్రయాణికుల ప్రాణాలు తన చేతుల్లో ఉన్నాయని భావించి తాను తిరిగి లేచానని చెప్పారు. హనుమాన్ చాలీసా చదువుతూ పోరాడినట్లు తెలిపారు. మోదీ ఆయన ధైర్యాన్ని ప్రశంసించారు. తన ప్రాణాల గురించి ఆలోచించే పరిస్థితిలో కూడా ప్రయాణికుల ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా పెట్టుకున్నారని కొనియాడారు. మోదీ కెప్టెన్ కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడారు. ఈ సంభాషణ దేశవ్యాప్తంగా వైరల్ కావడంతో విమాన ఘటనపై చర్చ మరింత పెరిగింది. ఇక్కడ మరో అంశం రాజకీయ చర్చకు వచ్చింది. ఒకవైపు ప్రధానమంత్రి స్వయంగా గాయపడిన పైలట్‌తో మాట్లాడారు. మరోవైపు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఇప్పటికే కెప్టెన్ స్మిత్ మచ్చార్ ధైర్యాన్ని ప్రశంసిస్తూ బహిరంగ ప్రకటన చేశారు. "అసాధారణ ధైర్యం, సమయస్ఫూర్తి ప్రదర్శించి విలువైన ప్రాణాలను కాపాడేందుకు సహకరించిన కెప్టెన్, సిబ్బందికి సెల్యూట్" అంటూ ఖర్గే స్పందించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ జైరాం రమేశ్ కూడా అక్టోబర్ 2న కెప్టెన్ స్మిత్ ధైర్యాన్ని ప్రశంసించారు. ఆయన చర్య స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అయితే రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ వంటి ముఖ్య నేతల నుంచి బహిరంగంగా స్పందన ఎందుకు కనిపించలేదన్న ప్రశ్నను బీజేపీ నేతలు రాజకీయంగా లేవనెత్తారు.



విమాన భద్రతపై అసలు ప్రశ్నలు

ఈ ఘటనను కేవలం రాజకీయ కోణంలో చూసి ఆపేయడం కంటే విమాన భద్రతపై వచ్చే ప్రశ్నలకు సమాధానాలు వెతకడం చాలా ముఖ్యం. ఒక సహ పైలట్ కాక్‌పిట్‌లో ఉన్న సమయంలో ఇలాంటి దాడి ఎలా జరిగింది? అతని గత నేపథ్యంపై ఎలాంటి తనిఖీలు జరిగాయి? విమాన సిబ్బంది మానసిక స్థితి, భద్రతా అంచనాలు, కాక్‌పిట్ యాక్సెస్ నిబంధనలు సరిపోతున్నాయా? అత్యవసర పరిస్థితుల్లో కాక్‌పిట్ తలుపు తెరవడానికి ఉన్న విధానం ఎంత సమర్థంగా పనిచేస్తోంది? ఇలాంటి ఘటన మళ్లీ జరగకుండా ప్రపంచ విమానయాన సంస్థలు ఎలాంటి మార్పులు చేయాలి? ఇవే ఇప్పుడు ప్రధాన ప్రశ్నలు. కెప్టెన్ స్మిత్ మచ్చార్ తన ప్రాణాలను పణంగా పెట్టి ప్రయాణికులను కాపాడటం ఈ కథలోని మానవీయ విజయమైతే, ఇలాంటి పరిస్థితి ఏర్పడకుండా ముందుగానే వ్యవస్థలను బలోపేతం చేయడం ప్రభుత్వాలు, విమానయాన సంస్థల బాధ్యత. రాజకీయ పార్టీలు కూడా ఈ ఘటనను ఓటు బ్యాంక్ చర్చగా మార్చడం కంటే భద్రతా లోపాలు ఎక్కడున్నాయో ప్రశ్నించడం ద్వారా ప్రజలకు ఉపయోగపడే చర్చను ముందుకు తీసుకెళ్లవచ్చు. బీజేపీ నేతలు రాహుల్ గాంధీ స్పందనపై ప్రశ్నలు లేవనెత్తారు. కాంగ్రెస్ మాత్రం ఖర్గే, జైరాం రమేశ్ ద్వారా కెప్టెన్ ధైర్యాన్ని బహిరంగంగా ప్రశంసించింది. అందువల్ల "ఒక పార్టీ మాత్రమే పైలట్‌ను గౌరవించింది" అనే సరళమైన రాజకీయ కథనం కంటే వాస్తవ స్పందనలను విడిగా చూడటం అవసరం. చివరికి ఈ ఘటన మనకు గుర్తుచేసేది ఒక్కటే. ఆకాశంలో ప్రమాదం ఎదురైనప్పుడు మతం, పార్టీ, ప్రాంతం, రాజకీయ గుర్తింపులు ఏవీ ముందుకు రావు. ముందుకు వచ్చేది బాధ్యత. కెప్టెన్ స్మిత్ మచ్చార్ అదే బాధ్యతను గాయాల మధ్య నిర్వర్తించారు. ప్రార్థన ఆయనకు ధైర్యం ఇచ్చి ఉండొచ్చు. కానీ ప్రయాణికుల ప్రాణాలను కాపాడింది ఆయన నిర్ణయం, శిక్షణ, సమయస్ఫూర్తి, బాధ్యతాభావం. అందుకే ఈ కథలో అసలైన హీరో ఒక మతం కాదు.. ఒక పార్టీ కాదు.. ఒక రాజకీయ నాయకుడు కాదు.. ప్రమాద సమయంలో వందలాది ప్రాణాలను తన ప్రాణాల కంటే ముందుగా చూసిన ఒక పైలట్.

వైభవ్ కోసం.. భారత్ ఎదురుచూపులు!

పదిహేనేళ్ల వయసు.. బ్యాట్ చేతిలో పడితే బౌండరీల మోత.. క్రీజులో అడుగు పెడితే ప్రత్యర్థి బౌలర్లకు సవాల్! వైభవ్ సూర్యవంశీ ఇప్పుడు భారత క్రికెట్‌లో ఒక పేరు మాత్రమే కాదు.. రేపటి సూపర్‌స్టార్ చర్చకు కేంద్రబిందువుగా మారిన సంచలనం. ఆసియా క్రీడల్లో స్వర్ణం.. జింబాబ్వేపై ప్లేయర్ ఆఫ్ ద సిరీస్.. ఐపీఎల్‌లో కోట్ల ధర.. అండర్19, 'ఏ' జట్లలో మెరుపులు.. ప్రతి మెట్టు పైనా తన ముద్ర వేస్తున్నాడు. అయినా టీ20 తుది జట్టులో చోటు మాత్రం ఇంకా ప్రశ్నార్థకమే! సంజూ శాంసన్, అభిషేక్ శర్మల విజయవంతమైన ఓపెనింగ్ కాంబినేషన్ ముందు వైభవ్ వేచి చూడాల్సి వస్తోంది. గౌతమ్ గంభీర్ చెబుతున్నది ఒక్కటే అవకాశం ఆలస్యం కావచ్చు.. కానీ తలుపులు మూసుకోలేదు! శ్రేయస్ అయ్యర్ మరో అడుగు ముందుకేసి.. అభిషేక్ శర్మకు కూడా అతడిపై అపారమైన నమ్మకం! మరి ఈ నిరీక్షణ ఎప్పటివరకు? తుది జట్టులో అడుగు పెట్టిన క్షణం నుంచి వైభవ్ ఎలాంటి ప్రభంజనం సృష్టిస్తాడు? భారత టీ20 భవిష్యత్ ప్రణాళికల్లో అతడి స్థానం ఎంత పెద్దదవుతుంది? ఇదే ఇప్పుడు అసలు ఆసక్తి.. ఎందుకంటే వైభవ్ సమయం వస్తే అది కేవలం ఒక అవకాశం కాదు.. భారత క్రికెట్‌లో కొత్త అధ్యాయానికి తొలి బంతి కావచ్చు!



వైభవ్ సూర్యవంశీ.. భారత్ క్రికెట్ కొత్త సంచలనం!

పదిహేనేళ్ల వయసు.. బ్యాట్ చేతిలో పడితే మాత్రం మైదానమే తనదన్న దూకుడు! వైభవ్ సూర్యవంశీ ఇప్పుడు భారత క్రికెట్‌లో కేవలం మరో యువ ప్రతిభ కాదు.. రాబోయే రోజుల్లో గేమ్ ఛేంజర్‌గా మారగలిగే పేరు! ఐపీఎల్ వేలంలో రూ.1.1 కోట్ల ధర పలకడం నుంచి అండర్19, 'ఏ' జట్లలో మెరుపులు.. అంతర్జాతీయ అరంగేట్రం.. జింబాబ్వేపై ప్లేయర్ ఆఫ్ ద సిరీస్.. ఆసియా క్రీడల్లో స్వర్ణ పతక విజేతగా నిలవడం వరకు వైభవ్ ప్రయాణం వేగంగా సాగుతోంది. అభిషేక్ శర్మతో కలిసి ఓపెనింగ్ చేసినా.. సంజూ శాంసన్, ఇషాన్ కిషన్ వంటి స్థిరపడిన స్టార్ల మధ్య తుది జట్టులో చోటు కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. అదే ఇప్పుడు అతడిని మరింత ఆసక్తికరమైన క్రికెట్ కథగా మార్చింది. గౌతమ్ గంభీర్ నుంచి శ్రేయస్ అయ్యర్ వరకు సీనియర్లు ఒక్కటే చెబుతున్నారు.. వైభవ్ సమయం వస్తుంది.. వచ్చినప్పుడు భారత క్రికెట్‌ను శాసించే స్థాయి అతడికి ఉందని! మైదానం బయట నిశ్శబ్దం.. క్రీజులో మాత్రం విధ్వంసం.. ఇదే వైభవ్ ప్రత్యేకత. అయితే ప్రశ్న ఇప్పుడు ఒక్కటే.. ఈ సంచలనం ఎప్పుడు భారత టీ20 తుది జట్టులో తన స్థానాన్ని శాశ్వతం చేసుకుంటాడు? రాబోయే ప్రపంచకప్ ప్రణాళికల్లో అతడి పాత్ర ఎంత పెద్దదవుతుంది? సమాధానం కాలమే చెబుతుంది.. కానీ భారత క్రికెట్ భవిష్యత్ చర్చలో వైభవ్ పేరు మాత్రం ఇప్పుడే సెంటర్ స్టేజ్‌లోకి వచ్చేసింది!

వైభవ్ వంతు వస్తుంది.. గంభీర్ హామీ!

15 ఏళ్ల సంచలనం వైభవ్ సూర్యవంశీ ఫామ్‌లో ఉన్నా టీ20ల్లో చోటు దక్కకపోవడంపై చర్చ నడుస్తున్న వేళ.. టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. "కొన్నిసార్లు ఆటగాడు తన అవకాశం కోసం వేచి ఉండాలి" అంటూ వైభవ్‌తో స్వయంగా మాట్లాడిన విషయాన్ని వెల్లడించాడు. అఫ్గానిస్థాన్‌తో టీ20 సిరీస్‌లో ఒక్క మ్యాచ్‌లోనూ ఆడే అవకాశం రాకపోవడానికి కారణం.. సంజూ శాంసన్, అభిషేక్ శర్మల ఓపెనింగ్ జోడీ ఇప్పటికే జట్టుకు మంచి ఫలితాలు అందించడమేనని గంభీర్ స్పష్టం చేశాడు. గత ఏడాది, రెండేళ్లుగా ప్రభావం చూపుతున్న కాంబినేషన్‌ను కొన్ని మ్యాచ్‌ల వైఫల్యాలతో ఒక్కసారిగా మార్చలేమన్నాడు. సోషల్ మీడియా హడావుడి, బయట వినిపించే విమర్శలు తుది జట్టును నిర్ణయించవని.. మ్యాచ్ గెలిపించే ఉత్తమ కాంబినేషన్‌నే కెప్టెన్, కోచ్ ఎంచుకుంటారని చెప్పాడు. వైభవ్‌ను ఆడిస్తే అభిషేక్ లేదా సంజూను ఎందుకు తప్పించామనే ప్రశ్నకు సమాధానం చెప్పాల్సి వస్తుందని వివరించాడు. ప్రజాదరణ పొందే నిర్ణయాలు తీసుకోవడం సులభమని, సరైన నిర్ణయం తీసుకోవడమే కష్టమని గంభీర్ తేల్చిచెప్పాడు. ప్రపంచకప్ నుంచి మరో ప్రపంచకప్ వరకు ఏ జట్టూ ఓటమి లేకుండా సాగలేదని గుర్తుచేస్తూ.. కొన్ని పరాజయాలు ఆటగాళ్ల స్థాయిని మార్చవని స్పష్టం చేశాడు. వైభవ్ కోసం తలుపులు మూసుకుపోలేదు.. సరైన సమయం కోసం ఎదురుచూస్తున్నాయి!

వైభవ్‌కు చోటు దక్కేనా?

ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకంతో జోష్‌లో ఉన్న టీమిండియా.. ఇప్పుడు వెస్టిండీస్‌తో ఐదు టీ20ల సమరానికి సిద్ధమైంది. లక్నో వేదికగా మొదలయ్యే ఈ సిరీస్‌లో అందరి చూపూ 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీపైనే! ఆసియా క్రీడల్లో అభిషేక్ శర్మతో కలిసి ఓపెనింగ్ చేసిన వైభవ్.. ఇప్పుడు తుది జట్టులో ఉంటాడా? లేక ఫామ్‌లో ఉన్న సీనియర్ల కోసం మరోసారి బెంచ్‌కే పరిమితమవుతాడా? ఇదే అసలు ప్రశ్న. అఫ్గానిస్థాన్‌పై వరుసగా రెండు హాఫ్ సెంచరీలు బాదిన సంజూ శాంసన్ కొనసాగడం దాదాపు ఖాయంగా కనిపిస్తుండగా.. అభిషేక్ శర్మకు కూడా చోటు దక్కే అవకాశాలు ఎక్కువ. దీంతో వైభవ్ కోసం నిరీక్షణ తప్పకపోవచ్చు. మరోవైపు ఇషాన్ కిషన్ ఈ ఏడాది టీ20ల్లో 1005 పరుగులతో ప్రపంచంలోనే వెయ్యికి పైగా పరుగులు చేసిన ఏకైక బ్యాటర్‌గా దూసుకెళ్తున్నాడు. వెస్టిండీస్ మాత్రం హిట్టర్ షిమ్రోన్ హెట్‌మయర్, రోవ్‌మన్ పావెల్, రొమారియో షెఫర్డ్‌లతో బలంగా బరిలోకి దిగుతోంది. భారత్‌వెస్టిండీస్ టీ20 పోరులో భారత్ 31 మ్యాచ్‌ల్లో 20 గెలిచింది. ఇక లక్నోలో భారత్ ఇప్పటివరకు ఒక్క టీ20 కూడా ఓడలేదు. వైభవ్ సంచలనానికి తలుపు తెరుచుకుంటుందా? లేక మరోసారి వేచి చూడాల్సిందేనా?

వైభవ్ టైమ్ వస్తే.. తుఫానే!

భారత్ టీ20 జట్టు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో ఆసక్తి రేపుతున్నాయి. "బయట చాలా ప్రశాంతం.. మైదానంలో మాత్రం విధ్వంసం" అంటూ వైభవ్ ఆటతీరులోని ప్రత్యేకతను అయ్యర్ హైలైట్ చేశాడు. క్రికెట్ గురించి అందరూ అతడితో మాట్లాడుతుంటారని, తాను మాత్రం మైదానం బయట అతడి జీవితం, కుటుంబం, ఆసక్తులు, ఇష్టాల గురించి తెలుసుకునేందుకు మాట్లాడతానని చెప్పాడు. అలా మాట్లాడితే వైభవ్ మరింత సహజంగా, స్వేచ్ఛగా ఉండగలడని అయ్యర్ అభిప్రాయపడ్డాడు. 2025 ఐపీఎల్ వేలంలో రాజస్థాన్ రాయల్స్ రూ.1.1 కోట్లకు దక్కించుకున్నప్పటి నుంచి వైభవ్ పేరు మార్మోగుతోంది. ఐపీఎల్‌తో పాటు అండర్19, 'ఏ' జట్లలోనూ మెరుపు ప్రదర్శనలు చేశాడు. ఇంగ్లండ్‌పై ఆరంభ మ్యాచ్‌ల్లో 14, 13, 15 పరుగులు చేసినా.. జింబాబ్వేతో టీ20ల్లో ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచాడు. ఆసియా క్రీడల్లో స్వర్ణం సాధించిన భారత జట్టులోనూ భాగమయ్యాడు. ప్రస్తుతం ప్రపంచకప్ విజేత ఓపెనర్లు జట్టులో ఉన్నందున వైభవ్ వేచి చూడాల్సి వస్తోందని అయ్యర్ చెప్పాడు. అయితే ఒక్కసారి అతడి సమయం వస్తే.. భారత క్రికెట్‌ను వైభవ్ శాసిస్తాడని కెప్టెన్ ధీమా వ్యక్తం చేశాడు.

వైభవ్.. చిన్నోడే.. కానీ ఆట పెద్దది!

ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం సాధించిన ఉత్సాహంతో భారత యువ జట్టు కొత్త సీజన్‌కు సిద్ధమవుతున్న వేళ.. 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీపై సహచరుడు అభిషేక్ శర్మ చేసిన వ్యాఖ్యలు ఆసక్తి రేపుతున్నాయి. "15 ఏళ్లప్పుడు మేమెలా ఉండేవాళ్లమో.. వైభవ్ అలా కాదు" అంటూ అభిషేక్ ప్రశంసలు కురిపించాడు. కేవలం వయసు చిన్నదని చూస్తే సరిపోదని, వైభవ్‌కు ఇప్పటికే రెండు, మూడు సంవత్సరాల క్రికెట్ వ్యవస్థలో అనుభవం ఉందని చెప్పాడు. ప్రొఫెషనల్ క్రికెట్ అవసరాలు, సాధన ఎలా ఉండాలి, ఎక్కడ ఎంత కష్టపడాలి అన్న అవగాహన అతడికి ఉందని వివరించాడు. అదే సమయంలో టీమ్‌లోని సీనియర్లు అతడిని జూనియర్‌గా కాకుండా తమలో ఒకడిగా భావిస్తున్నారని అభిషేక్ తెలిపాడు. "మేమంతా నీకు అన్నలమే.. నువ్వు ఆటను ఆస్వాదించు, అవకాశం వచ్చినప్పుడు నీ అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వు" అంటూ వైభవ్‌కు భరోసా ఇచ్చాడు. ఒక్కసారి గెలవడం కంటే విజయాన్ని అలవాటుగా మార్చుకోవడమే అసలు సవాలని అభిషేక్ అభిప్రాయపడ్డాడు. జట్టు మొత్తం ఒకరి కోసం మరొకరు ఆడుతూ, భారత్‌ను గెలిపించాలనే ఆకలితో ఉంటే విజయాలు వరుసగా వస్తాయని చెప్పాడు.



ప్యారిస్ వీధుల్లో జాన్వీ ఫ్యాషన్ ఫైర్!

మినీ స్కర్ట్.. ఫర్ జాకెట్.. • మియూ మియూ షోలో గ్లామర్ మెరుపులు

ప్యారిస్ ఫ్యాషన్ వీక్ వేదికగా బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ మరోసారి తన స్టైల్‌తో అందరి దృష్టిని ఆకర్షించింది. మియూ మియూ షోకు హాజరైన ఆమె.. శరదృతువు అందాలను తనదైన గ్లామర్‌తో కలిపి చూపించింది. గోధుమ, ఆరెంజ్, ఆకుపచ్చ, పసుపు, బేజ్ రంగుల్లో చారలు, ఆకులు, పూల డిజైన్లతో మెరిసిన మినీ స్కర్ట్, దానికి జోడించిన క్రాప్డ్ జాకెట్ ఆమె లుక్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. లోపల నీలిరంగు స్లీవ్‌లెస్ టాప్ ఆ వెచ్చని రంగుల మధ్య మరింత ప్రత్యేకంగా కనిపించింది. బ్రౌన్ హీల్స్, మియూ మియూ మినీ బ్యాగ్, రెట్రో సన్‌గ్లాసెస్‌తో జాన్వీ లుక్ పూర్తయింది. పెద్దగా ఆభరణాల హంగామా లేకుండా కొన్ని గోల్డ్ రింగ్స్‌తోనే స్టైల్‌ను సింపుల్‌గా ఉంచింది. వాల్యూమ్ బ్లోఅవుట్ హెయిర్, మెరిసే పెదాలు, సహజమైన మేకప్ ఆమె అందాన్ని మరింత పెంచాయి. మరో ప్యారిస్ లుక్‌లో లావెండర్, బేజ్ రంగుల ఫర్ పెప్లమ్ జాకెట్, ఎంబ్రాయిడరీ, షీర్ లేస్ మిడీ స్కర్ట్‌తో జాన్వీ మరోసారి ఫ్యాషన్ ఫోకస్‌గా మారింది. సినిమా తెరపై మాత్రమే కాదు.. ఫ్యాషన్ ప్రపంచంలోనూ తనదైన ముద్ర వేయగలనని జాన్వీ ఈ ప్యారిస్ స్టైల్ జర్నీతో మరోసారి చూపించింది.



వైరల్ వీడియోపై వర్మ కామెంట్స్

విమర్శలు కాదు.. నిందితుడి వేటే అసలు టార్గెట్

సినిమా పాట.. సోషల్ మీడియాలో వైరల్.. ఆపై దేశవ్యాప్తంగా దుమారం! జాన్వీ కపూర్ నటించిన దేవర: పార్ట్ 1లోని 'చుట్టమల్లే' పాటకు సంబంధించిన ఫుటేజీని వక్రీకరించి, అసభ్యకరంగా మార్చిన ఏఐ వీడియో వ్యవహారం ఇప్పుడు సినీ పరిశ్రమలో తీవ్ర చర్చకు దారితీసింది. ఈ వివాదంపై దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ తనదైన శైలిలో సంచలన వ్యాఖ్యలు చేశారు. వీడియోను ఖండిస్తూ సెలబ్రిటీలు బహిరంగంగా మాట్లాడటం వల్లే.. తెలియని లింక్ కోట్లాది మందికి తెలిసిపోయే అవకాశం ఏర్పడిందని ఆయన అభిప్రాయపడ్డారు. "అందరూ కలిసి వీడియోను ఆపడం కంటే.. దానిని మరింత పాపులర్ చేశారు" అన్నట్టుగా వర్మ వ్యాఖ్యలు చేశారు. అసలు తెలివైన పని నిందితుడిని గుర్తించి పట్టుకోవడమేనని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై జూనియర్ ఎన్టీఆర్ ఇప్పటికే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జాన్వీ కూడా అనుమతి లేకుండా సాంకేతికతను దుర్వినియోగం చేసి కృత్రిమ కంటెంట్ సృష్టించడం తీవ్రంగా ఉల్లంఘనగా పేర్కొన్నారు. చిరంజీవి, విజయ్ దేవరకొండ, ఖుష్బూ సుందర్ తదితరులు జాన్వీకి మద్దతుగా నిలిచారు. వీడియోపై రచ్చ కంటే.. దాని వెనుక ఉన్న చేతిని పట్టుకోవడమే అసలు క్లైమాక్స్!

20 ఏళ్ల నుంచే ఆ పనే చేస్తున్నా..

ఐటీ సోదాలతో నాకేం సంబంధం తప్పడు వార్తలు రాయొద్దన్న రకుల్

ఐటీ సోదాల వార్తలు బాలీవుడ్‌లో కలకలం రేపుతున్న వేళ.. తన పేరును ఈ వ్యవహారంతో ముడిపెట్టడంపై నటి రకుల్ ప్రీత్ సింగ్ తీవ్రంగా స్పందించింది. సెప్టెంబర్ 28న ముంబైలో అనుమానాస్పద నిధుల లావాదేవీలపై 12 ప్రాంతాల్లో ఆదాయపు పన్ను శాఖ సోదాలు నిర్వహించిన నేపథ్యంలో వచ్చిన కథనాలపై ఆమె స్పష్టత ఇచ్చింది. "ఆ సోదాలకు నాకు ఎలాంటి సంబంధం లేదు. 20 ఏళ్ల వయసు నుంచే చట్టబద్ధంగా పన్నులు చెల్లిస్తున్నాను" అని రకుల్ పేర్కొంది. సాయుధ దళాల కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన తాను పరిశ్రమలో ఎలాంటి గాడ్‌ఫాదర్ లేకుండా కష్టపడి ఎదిగానని తెలిపింది. తన వ్యక్తిగతంగా కానీ, ఏ నిర్మాణ సంస్థ తరపున కానీ అక్రమ విదేశీ నగదు బదిలీల్లో పాల్గొనలేదని స్పష్టం చేసింది. దేశంలో కానీ విదేశాల్లో కానీ తనకు బినామీ ఆస్తులు లేవని, ఎవరూ తనకు ఖరీదైన ఆస్తులు బహుమతిగా ఇవ్వలేదని చెప్పింది. వాస్తవాలు నిర్ధారించకుండా తనపై వచ్చిన కథనాలు "తప్పుడు, దురుద్దేశపూరితమైనవి" అంటూ వాటిని వెనక్కి తీసుకుని నిజాలను వెల్లడించాలని మీడియాను కోరింది. ఇదే సమయంలో విదేశీ లావాదేవీలకు సంబంధించిన పత్రాలు, ఆర్థిక రికార్డులను అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. వార్తల తుపానులో తనపై పడిన మచ్చను మాటలతో కాదు.. వాస్తవాలతో తుడిచే ప్రయత్నం చేసింది రకుల్!

జైలర్-2 ట్రైలర్ దెబ్బకు గూస్‌బంప్స్!

రజనీ మాస్‌కు తోడైన స్టార్ కాస్ట్.. ఓటీటీ రికార్డు టాక్



మాస్ మహారాజు కాదు.. మాస్‌కు అసలైన నిర్వచనం రజనీకాంత్! నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో వచ్చిన జైలర్ రూ.600 కోట్లకుపైగా వసూళ్లతో 2023లో బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన నేపథ్యంలో.. ఇప్పుడు జైలర్2పై అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. రజనీ స్టైల్, పవర్‌ఫుల్ ఎలివేషన్లు, నెల్సన్ మార్క్ మేకింగ్, కామెడీ, యాక్షన్ కలిసిన తొలి భాగం సృష్టించిన జోష్‌కు కొనసాగింపుగా వస్తున్న ఈ సీక్వెల్ అక్టోబర్ 15న దసరా కానుకగా ప్రపంచవ్యాప్తంగా సందడి చేయనుంది. మొదటి భాగం ఎక్కడ ముగిసిందో.. అక్కడి నుంచే కథ మొదలవుతుందని సమాచారం. తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమా రేంజ్‌ను ఒక్కసారిగా పెంచేసింది. ఎస్.జే. సూర్య, మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్, విద్యాబాలన్ పాత్రలను మెరుపులా పరిచయం చేస్తూ సాగిన ట్రైలర్ అభిమానుల్లో గూస్‌బంప్స్ పుట్టిస్తోంది. అనిరుధ్ సంగీతం మరోసారి మాస్ మోత మోగించేందుకు సిద్ధమైంది. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి విడుదలకు ముందే రికార్డు బిజినెస్ జరిగినట్లు సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. ముఖ్యంగా అమెజాన్ ప్రైమ్ వీడియో డిజిటల్ హక్కులను ఏకంగా రూ.160 కోట్లకు దక్కించుకున్నట్లు సమాచారం. అదే నిజమైతే.. రజనీ ఖాతాలో మరో సంచలన రికార్డు చేరినట్టే! ఇక థియేటర్లలో 'జైలర్ 2' మోత మొదలైతే.. బాక్సాఫీస్ బాద్‌షా ఎవరో మరోసారి ప్రపంచానికి తెలిసే టైమ్ వచ్చేసింది!

This newspaper is Owned and Published by **GUNDEBOINA VENKANNA** from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: **GUNDEBOINA VENKANNA** and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: **TGBIL/26/A6717**. www.rajyasamskarana.com.